# ప్రజాశక్తి

సోమవారం 16 డిసెంబర్ 2024

8 పేజీలు




విశాఖపట్నం



అనకాపల్లి

## హయ 'గ్రీవా'.. జగదీశ్వరుడి మోసాల 'హవా'...

- బ్యాంకుల్లో తప్పుడు పత్రాలతో రూ.325 కోట్లు లూటీ...
- 114 క్రిమినల్, సివిల్ కేసులు మోపబడి 'రికార్డు' సృష్టి
- విశాఖలోని అన్ని క్రిమినల్ కోర్టుల్లోనూ ఆయనపై కేసులే...
- సిబిఐ విచారణ చేసి చర్యలు తీసుకోవాలంటూ ఫ్రాడ్స్‌పై అధ్యయనం చేసిన అడ్వకేట్ నివేదిక
- యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ముంబాయి యాజమాన్యానికి 30 పేజీల నివేదికను సమర్పించిన న్యాయవాది జి.వరుణ్‌కుమార్




**ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో**

బ్యాంకులకు తప్పుడు పత్రాలు, వివాదాస్పద ఆస్తులు, ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న ఆస్తులను సైతం సెక్యూరిటీ, ష్యూరిటీలుగా చూపి సుమారు రూ.325కోట్లు అప్పులు తీసుకుని మోసాలే జీవనంగా మలచుకున్న హయగ్రీవా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ (హెచ్‌ఐపిఎల్) అధినేత జె.జగదీశ్వరుడి 'ఆర్థిక అరాచకాలపై' విశాఖకు చెందిన అడ్వకేట్ జి.అరుణ్‌కుమార్ విచారణ పూర్తిగా 2024 నవంబర్ 2వ తేదీన 30 పేజీల నివేదికను సిద్ధం చేశారు. ఈ మేరకు వివిధ బ్యాంకుల్లో జగదీశ్వరుడి బాగోతంపై తాజాగా చర్చ రేగుతోంది. విశాఖ సహా హైదరాబాద్ పలు న్యాయస్థానాల్లో 114 క్రిమినల్, సివిల్ కేసులు మోపబడిన ఏకైక 'ఆర్థిక అక్రమార్జనపరుడి'గా జగదీశ్వరుడు బ్రాండ్ ఇమేజ్ వెలిగిపోతోంది. మహానగరం విశాఖ మాయగాడుగా పలు బ్యాంకులు ముద్ర వేసిన జగదీశ్వరుడు బినామీ పేర్లతో రుణాలు తీసుకుని మనీలాండరింగ్‌కు పాల్పడిన వైనాలు కళ్లకు కట్టినట్లుగా అడ్వకేట్ వరుణ్ పేర్కొన్నారు. యూనియన్ బ్యాంక్ ఇండియా ముంబయి ఉన్నతాధికారులు సదరు అడ్వకేట్‌ను విచారణ చేయాల్సిందిగా కోరగా పలు ఆసక్తికర అంశాలను, జగదీశ్వరుడి ఫ్రాడ్ చేసిన తీరును నివేదిక రూపంలో పొందుపరిచి ముంబయి పంపారు.

### ఏ బ్యాంకు దగ్గర ఎంత?

యాక్సిస్ బ్యాంకు : రూ.40.50కోట్లు
యూనియన్ బ్యాంక్ (మిడ్ కార్పొరేట్) : రూ.130కోట్లు
కరూర్ వైశ్యా బ్యాంకు : రూ.37కోట్లు
ఆంధ్రా బ్యాంకు : రూ.61.50 కోట్లు
ఎపి ఎస్‌ఎఫ్‌సి : రూ.2.15కోట్లు

**నివ్వెరపోతున్న జనం...**

సామాన్యుడు వెయ్యిరూపాయలు బాకీ ఉంటేనే ముప్పతిప్పలు పెట్టే బ్యాంకులు జగదీశ్వరుడి విషయంలో మాత్రం కళ్లు మూసుకున్నాయి అన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. యూనియన్ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు, కార్పొరేట్ బ్యాంక్, కరూర్ వైశ్యాబ్యాంక్‌ల నుంచి రూ.271.17కోట్లు అప్పులు తీసుకున్నాడు. వడ్డీలతో కలిపి జగీశ్వరుడు బ్యాంకులకు 2021-22 నాటికి రూ.325కోట్లు చెల్లించాల్సి ఉంది. హయగ్రీవా జగదీశ్వరుడికి అప్పులు ఇచ్చిన బ్యాంకుల్లో ప్రధాన మైనది యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యాక్సిస్ బ్యాంకు, కరూర్ వైశ్యా బ్యాంకు, ఎపి స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్లు ఉన్నాయి. ఈ రుణాలు మంజూరు చేయడంలో ఆయా బ్యాంకుల ఉన్నతాధికారులు మిగతా 2లో..

## సాంఘిక సంక్షేమంపై దృష్టి!

- ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థల్లో ఎస్‌సి కేటగిరీల ప్రాతినిధ్యం పరిశీలన
- 18న కమిషన్ ఫిర్యాదుల స్వీకరణ
- 'ప్రజాశక్తి'తో విశాఖ జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జె.రామారావు






**ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో**

సాంఘిక సంక్షేమంపై 2024-2025 సంవత్సరంలో దృష్టిసారిస్తూ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధికి తగిన విధంగా ప్లాన్ రూపొందించే కార్యాచరణను చేపట్టనున్నామని విశాఖపట్నం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జె.రామారావు వెల్లడించారు. ఎస్‌సి ఉపకులాల వివరాల పరిశీలనకు, వారి అభ్యున్నతికి తోడ్పడేందుకు రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ అంశాన్ని పరిశీలించేందుకు ఏకసభ్య కమిషన్‌ను ఈ నెల 15న నియమించడంతో ఈ నెల 18వ తేదీ వరకూ జిల్లాలో పర్యటనలు జరిపి అధికారులు, ఉప కులాల సభ్యులు, సంఘాలతో సమావేశాలు నిర్వహించి 18న జిల్లా కలెక్టరేట్‌లో వినతులు స్వీకరిస్తుందని వివరించారు. దీనికి సంబంధించి ప్రజాశక్తి ఆయనతో ముఖా ముఖి నిర్వహించింది.

**కమిషన్ ఉద్దేశం ఏమిటి?**

రాష్ట్ర వ్యాప్త పరిశీలనలో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థల్లో షెడ్యూల్ కులాల ఉప వర్గాల ప్రాతినిధ్యం ఎలా ఉందో కమిషన్ పరిశీలన చేస్తోంది. షెడ్యూల్ కులాల్లోని వివిధ ఉప వర్గాల సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా విషయ పరంగా వెనుకబాటును మిగతా 2లో..

### సిజిఎం ద్వంద్వ వైఖరి మానుకోవాలి

వార్త 3లో..

### ఘనంగా పొట్టి శ్రీరాములు వర్థంతి

వార్త 7లో..

### విజయవంతంగా వైజాగ్ మారథాన్

వార్త 8లో..

### పరీక్షల సమయంలో ట్రైనింగ్ సరికాదు : యుటిఎఫ్

వార్త 5లో..



సిపిఎం కంచరపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యాన విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న మహిళలు

## విద్యుత్ భారాలపై నిరసన

వార్త 4లో....

## వసతి గృహాల్లో సదుపాయాల కొరత

- ఇతర చోట్లా ఇదే సమస్య
- కొరువాడలో కిటికీలకు లేని తలుపులు
- చల్లగాలికి నిద్రపోని విద్యార్థులు
- సురక్షిత నీరూ కరువే



కొరువాడ బిసి బాలుర వసతి గృహం

**ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి :** పేద పిల్లలు చదువుతున్న వసతి గృహాల్లో కనీస సదుపాయాలు ప్రభుత్వం కల్పించడంలేదు. చలికాలంలో తలుపులు, కిటికీలు సరిగాలేక చలిగాలులకు నిద్రపోని రాత్రులు విద్యార్థులు గడుపుతున్నారు. ప్రభుత్వ భవనాలు సహా ప్రయివేటు అద్దె భవనాల్లో ఈ సమస్య ఎంతోకాలంగా వెంటాడుతున్నా ఎవరికీ పట్టడంలేదు. వసతి గృహాల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన వార్డెన్లకు బడ్జెట్‌లేదని సమాధానం చెబుతున్నారు. పంపిన ప్రతిపాదనలకు దిక్కూమొక్కూలేదు. జిల్లాలోని కె.కోటపాడు మండలం కొరువాడలోని బిసి బాలుర వసతిగృహం మరమ్మతులు చేపట్టకపోవడంతో వర్షాలు పడితే స్లాబ్ నుంచి నీరు కారుతోంది. పై నుంచి పెచ్చులు పడుతున్నాయని విద్యార్థులు తెలిపారు. విద్యార్థులు నిద్రపోయే మంచాలపై పెచ్చులుపడుతున్నా స్లాబ్ మరమ్మతు చేయాలన్న ఆలోచన ఎమ్మెల్యే, జిల్లా ప్రభుత్వ యంత్రాంగానికి రాలేదు. తలుపుల్లేని గదిలోకి చల్లగాలి రాకుండా మిగతా 2లో..



పెచ్చులూడిన స్లాబ్



తలుపులు లేక అడ్డుపెట్టుకున్న దుప్పటి

మొదటి పేజీ తరువాయి..

## హాయ 'గ్రీవా'.. జగదీశ్వరుడి మోసాల 'హవా'..

కూడా ఉన్నారన్న ఆరోపణలు తాజాగా వినిపిస్తున్నాయి. బ్యాంకు యాజమాన్యాలు దీనిపై సిబిఐ విచారణ వేసి నిగ్గుతేల్చాల్సిన బాధ్యత ఉన్నా ఆ పనిచేయకపోవడంతో పెద్ద తలకాయలు ఉన్నట్లు ఈ బ్యాంకుల్లోగల ఉద్యోగుల్లో తాజాగా చర్చసాగుతోంది. తప్పుడు డాక్యుమెంట్లతో ఆర్థిక నేరాలకు పాల్పడుతున్న జగదీశ్వరుడిపై స్థానిక న్యాయవాది వరుణ్ కుమార్ యూనియన్ బ్యాంకు సిఎండి మణి మేఖలైకి ఫిర్యాదు చేశారు. ప్రజా ప్రయోజనాలను కాపాడడం కోసం ఫిర్యాదు చేసినట్లు వరుణ్ ఈ సందర్భంగా వెల్లడించారు.

**జగదీశ్వరుడి మోసాల చిట్టా చూస్తే...**

వన్ టైం సెటిల్‌మెంట్ స్కీంలో రూ.36.49కోట్లు వైవర్ (మాఫీ) బ్యాంకుల్లో చేయించుకున్నాడు. రూ.40కోట్ల వడ్డీ రాయితీని కూడా అక్రమంగా పొందాడు. ఈ వ్యవహారంలో మొత్తంగా రూ.75కోట్ల కైంకర్యం చేసినందుకు గాను హయగ్రీవా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ (హెచ్ఐపిఎల్) యజమాని జగదీశ్వరుడుపై క్రిమినల్, సివిల్ కేసులు 114 వివిధ న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్నాయి. టర్నోవర్‌ను కృత్రిమంగా పెంచుకుని బ్యాంకుల నుంచి లోన్‌లు తీసుకోవడం, బోగస్ బిల్లులను జతపరిచి టర్నోవర్‌ను చూపించడంతో విశాఖపట్నం జిఎస్‌టి డిపార్టుమెంట్ అధికారులు క్రిమినల్ కేసును ఫైలు చేశారు. బ్యాంకు గ్యారెంటీలను కూడా (లెటర్ ఆఫ్ క్రెడిట్) రెండింటినీ ఫేక్ తయారుచేసి వర్క్ ఆర్డర్లను తెచ్చుకున్నాడు. బ్యాంకులకు కూడా ఈ ఫేక్ గ్యారెంటీ వర్క్ ఆర్డర్లను చూపించి 90శాతం రుణాలు రూ.186.29కోట్లు వివిధ కంపెనీలు, సంస్థల నుంచి బ్యాంకు గారెంటీల మొత్తం తెచ్చుకున్నాడు.

**ఫండ్స్ ఎలా దారిమళ్లించాడు...**

బ్యాంకుల్లో రుణాలను థర్డ్ పార్టీ (కొల్లాటరల్ సెక్యూరిటీ) ద్వారా దోచుకుని ఈ డబ్బును మనీ లాండరింగ్ ద్వారా వేరేవాళ్లకు లోన్స్ అండ్ అడ్వాన్సెస్ కింద ఇచ్చాడు. అప్పులు చెల్లించలేదని జగదీశ్వరుడ్ని బ్యాంకులు టార్గెట్ చేశాక అంటే ఎన్‌పిఎ (నాన్ పెర్ఫార్మింగ్ అసెట్స్ డిక్లేర్) అయ్యాక కొత్త బ్యాంక్ అకౌంట్ "పద్మావతి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు (సికింద్రాబాద్)లో 1001021001898 అకౌంట్‌ను ఓపెన్ చేసి దీనికి 2021-2022లో ఫండ్స్ రూ.50కోట్లను డైవర్షన్ చేసుకుని వాడుకున్నాడు. సిబిఐ విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలంటూ అడ్వకేట్ వరుణ్ తన నివేదికలో పేర్కొన్నారు.

## సాంఘిక సంక్షేమంపై దృష్టి!

కూడా పరిశీలిస్తుంది.

**సాంఘిక సంక్షేమ వసతి గృహాల పరిస్థితి ఏమిటి?**

ఏపి ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల మరమ్మతుల కోసం నిధులను విడుదల చేసింది. విశాఖ జిల్లాలో 18 వసతి గృహాల మరమ్మతులకు గాను రూ.202.79 లక్షలను విడుదల చేసింది. పిల్లల్లో సృజనాత్మకత, పోటీ పరీక్షల వైపు వెళ్లి మంచి ఉపాధి పొందేలా హాస్టళ్లలో సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నాం.

**విశాఖ జిల్లాలో హాస్టళ్లకు నిధుల మంజూరు వివరాలు చెబుతారా?**

నగరంలోని తూర్పు పరిధిలోగల 2 హాస్టళ్లకు రూ.19.5 లక్షలు, పశ్చిమంలో గల ఒక హాస్టల్‌కు రూ.15.41 లక్షలు, పెందుర్తిలోని హాస్టల్‌కు రూ.8.65 లక్షలు, గాజువాకలోని 2 హాస్టళ్లకు రూ.20.09 లక్షలు విడుదలకు కలెక్టర్ అనుమతించారు. భీమిలి మండలంలోని 9 హాస్టళ్లకు రూ.117.99లక్షలు, ఈ మొత్తంలో మైనర్ రిపేర్లకు గాను రూ.91.59లక్షలు, మేజర్ రిపేర్లకు రూ.111.20 లక్షలు విడుదల చేశాం.

## వసతి గృహాల్లో సదుపాయాల కొరత

విద్యార్థులు కర్టెన్ అడ్డంపెట్టుకున్నారు. కొన్ని గదులకు కిటికీలు ఊడిపోయాయి. తలుపు చెక్కలకు చెదలు పట్టి కింద పడిపోయాయి. కిటికీలకు అడ్డమేమీ లేకపోవడంతో చలిగాలి, దోమలతో విద్యార్థులు బాధపడుతున్నారు. సిబ్బంది సొంత డబ్బులతో మూడు కిటికీలకు మెస్ వేసినా, మిగిలిన కిటికీలకు లేకపోవడంతో విద్యార్థులు చలిగాలులకు వణికిపోతున్నారు. మూడు నుంచి పది తరగతుల విద్యార్థులు 48 మంది ఉన్నారు. ఆరు గదుల్లో ఎనిమిది మంది చొప్పున విద్యార్థులను సర్దుబాటుచేసినా, గదికి మూడు మంచాలు మాత్రమే ఉన్నాయి. దీంతో మిగిలిన విద్యార్థులు బయట వరండాలోనూ, తోటి విద్యార్థుల గదుల్లోనూ సర్దుకుంటున్నారు. భోజన గదిలేకపోవడంతో భోజనాలు బయట తింటున్నారు. సురక్షిత మంచినీటి సౌకర్యం కల్పించలేదు. క్లోరినేషన్ లేని బోరు నీరే తాగుతున్నారు. నిధుల్లేక దాతలు ఇచ్చిన ఆర్‌ఒ ప్లాంట్ బిగించలేదు. దాదాపు రెండున్నర ఎకరాల విస్తీర్ణంలోని ఈ వసతి గృహం ఆహ్లాదకరంగా తయారుచేసే అవకాశమున్నప్పటికీ ప్రభుత్వాల నిర్లక్ష్యంతో అసౌకర్యాల నడుమ వేరే దారిలేక పేద విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారు. నిధుల్లేక ఇన్వెర్టర్ మరమ్మతు చేయలేని దుస్థితిలో వసతి గృహం ఉంది. జిల్లాలోని సిఎస్‌ఆర్ నిధులతో తీర్చిదిద్దిన కశింకోట బిసి బాలుర వసతి గృహం మినహా మిగిలిన బిసి బాలుర, బాలికల వసతి గృహాల పరిస్థితి దాదాపు కొరువాడ వసతి గృహాన్ని పోలివున్నాయి.

వసతి గృహాల మరమ్మతులు, కనీస సదుపాయాల ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోయినా, పరిశ్రమల నుంచి సిఎస్‌ఆర్ నిధులను సమీకరించి సదుపాయాలు సమకూర్చే వెసులుబాటు ఉన్నప్పటికీ ఆ శ్రద్ధ ఎమ్మెల్యేలు, ప్రభుత్వ యంత్రాంగం తీసుకోవడంలేదు. జిల్లాలోని 39 బిసి వసతి గృహాల్లో 30 బాలురు, 9 బాలికల వసతి గృహాలున్నాయి. వీటిలో ప్రభుత్వ భవనాలు కల్గిన వసతి గృహాలు 29కాగా, మిగిలివి ప్రయివేటు భవనాల్లో నడుస్తున్నాయి. దాదాపు అన్ని వసతి గృహాల్లోనూ ఫ్యాన్లు సరిగా తిరగని సమస్య ఉంది. కొరువాడ వసతి గృహం వార్డెన్ రామన్నదొర మాట్లాడుతూ, పిల్లలకు వేడినీరు ఇస్తున్నామని, మరమ్మతులకు రూ.29 లక్షలతో ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

# విశాఖ నగర వైసిపి కార్యాలయం ప్రారంభం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న విజయసాయి రెడ్డి

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : మద్దిలపాలెంలోని కృష్ణా కళాశాల సమీపంలో విశాఖ నగర వైసిపి కార్యాలయాన్ని ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ విజయసాయి రెడ్డి ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత ఎన్నికల్లో ఏ పార్టీ కార్యాలయంగా వేదికగా విజయం సాధించామో మళ్లీ కార్యాలయాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఓడిపోయామనే ఆందోళన అవసరం లేదని, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులందరినీ కలుపుకు పోవాలని, కార్యకర్తలకు వైఎస్ జగన్ అండగా ఉంటారని, వారికి ఎలాంటి నష్టం జరగకుండా చూసుకుంటామని చెప్పారు. జమిలి ఎన్నికలు వస్తాయని, 2027 ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని చెప్పారు. మహిళకు 33 శాతం రిజర్వేషన్లతో పాటు, అసెంబ్లీ, ఎంపీ స్థానాలు పెరుగుతాయని తెలిపారు. తనకు విశాఖ నుంచి పోటీ చేసే ఆలోచన లేదని, పార్టీని గెలిపించడమే లక్ష్యంగా పనిచేస్తానని చెప్పారు.

బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ, కరెంట్ చార్జీల పెంపుపై ఈ నెల 27వ తేదీన నిరసన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజలతో సంబంధం లేకుండా మీడియాను పట్టుకొని హడావిడి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ తనూజారాణి, విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, బూడి ముత్యాల నాయుడు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

# విశాఖలో మ్యాక్ తొలి వార్షికోత్సవం



మాట్లాడుతున్న శ్రీ దామోదర్ సంజీవయ్య లా యూనివర్సిటీ వీసీ సూర్య ప్రకాశరావు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఎఐ ఆధారిత అస్తటిక్ క్లినిక్ మ్యాక్ సంస్థ తొలి వార్షికోత్సవం విశాఖపట్నం బీచ్ రోడ్‌లోని పార్క్ హోటల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా శ్రీ దామోదర్ సంజీవయ్య లా యూనివర్సిటీ ఉపకులపతి సూర్య ప్రకాశరావు హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థాపించిన అనతి కాలంలోనే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపుతో పాటు రెండు వేలమందికి పైగా ఖాతాదారులు సంపాదించుకోవడం చిన్న విషయం కాదన్నారు. మహిళా సాధికారతకు ఈ సంస్థ కృషి చేస్తుందని కొనియాడారు. భవిష్యత్తులో ఈ సంస్థ మరిన్ని మైలురాళ్లను అందుకోవాలని ఆకాంక్షించారు. మ్యాక్ అస్తటిక్ సంస్థ ఎమ్‌డి డాక్టర్ వల్లి కొరపాటి మాట్లాడుతూ, మహిళా సాధికారత కోసం బ్యాంకు రుణంతో ఈ సంస్థను స్థాపించి మహిళలకు చేయూత నిస్తున్నానని తెలిపారు. మ్యాక్ ఆకామీ ద్వారా నిరుద్యోగ యువతులకు హెయిర్ అండ్ స్కిన్ కేర్ విభాగంలో శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. తమ సంస్థకు దేశవ్యాప్తంగా 40 శాఖలు ఉన్నాయని త్వరలోనే హైదరాబాద్, బెంగళూరులలో నూతన శాఖలను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ పి.వి.సుధాకర్, యూనియన్ బ్యాంకు ఆర్ఎం నరసింహకుమార్, ప్రముఖ వ్యాపారవేత్త పైడా కృష్ణప్రసాద్, ఆడారి కిశోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చిల్లర నాణేలు పంపిణీ చేస్తున్న కనక మహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ అధికారులు, సిబ్బంది

## చిల్లర నాణేల పంపిణీ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వినియోగదారులు, వర్తకులు చిల్లర నాణేల కొరతను ఎదుర్కొంటున్న నేపథ్యంలో కనక మహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ సీతమ్మధార బ్రాంచ్ అధికారులు ఆదివారం సీతమ్మధార రైతు బజారులో చిల్లర నాణేల పంపిణీ చేపట్టారు. బ్యాంకు సామాజిక కార్యక్రమంలో భాగంగా వినియోగదారులకు, వ్యాపారులకు రూ.ఒక రూపాయి నుంచి రూ. 20 విలువ కలిగిన నాణేలు, నోట్లును రూ.3.50 లక్షలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సీతమ్మధార బ్రాంచ్ మేనేజర్, రైతు బజార్ ఎస్టేట్ అధికారి, అధికారులు పాల్గొన్నారు.

## యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : నిత్యం యోగా చేయడం వల్ల మానసిక, శారీరక ఆరోగ్యాలకు ఎంతో మేలు కలుగుతుందని రాష్ట్ర పతంజలి ఉపాధ్యక్షులు టివిఎస్.ప్రసాదరావు అన్నారు. పార్వతీనగర్‌లోని ప్రిన్స్ అపార్ట్‌మెంట్ పార్క్‌లో యోగా శిబిరాన్ని ఆదివారం ప్రసాదరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మానసిక శారీరక ఆరోగ్యాలకు యోగాను మించిన సాధనం మరొకటి లేదని తెలిపారు. పర్సనాలిటీ డెవలప్‌మెంట్, నైపుణ్యాల పెంపుదలలో యోగా ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. నేడు విద్యార్థులు ఎదుర్కొనే చిన్నచిన్న శారీరక, మానసిక సమస్యలను యోగాభ్యాసాల ద్వారా దూరం చేసుకోవచ్చన్నారు.

రాష్ట్ర కిసాన్ సేవా సమితి ఉపాధ్యక్షులు సాయి నాగేశ్వరరావు మాట్లాడుతూ, మనిషికి రోగాలు రాకుండా మానసిక సమస్యలను దూరం చేస్తూ ఆరోగ్య జీవనాన్ని అందించే శక్తి యోగాకు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరావు, జిల్లా సభ్యులు గణపతి, బి.ప్రభాకర్‌మూర్తి, ముత్యాల నాయుడు, యువభారత్ రెడ్డి పాల్గొన్నారు.

## ముగిసిన ఆర్గానిక్ మేళా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ఆర్గానిక్ మేళా ఆదివారం ముగిసింది. చివరి రోజు కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన మిద్దె తోటల పెంపకం కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటివ్ ఆఫ్ ఫారెస్ట్ చిరంజీవి చౌదరి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ పర్యావరణ హితంగా జీవించాలని పిలుపునిచ్చారు. ఇంటి పైకప్పు మీద కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్న వారికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పివిఎన్.మాధవ్, బి.ప్రభాకర్, జలగం కుమార్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

# క్యామ్రీ హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వెహికల్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : టొయోటా కిర్లోస్కర్ మోటర్ (టికెఎం) "సెడాన్ టు ది కోర్"గా రూపొందించిన క్యామ్రీ హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వాహనాన్ని విశాఖ మార్కెట్‌లో విడుదల చేశారు. మద్దిలపాలెంలోని టొయోటా షో రూమ్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సంస్థ ప్రాంతీయ ప్రతినిధి శబరి మనోహర్ మాట్లాడుతూ, ఈ వాహనం 5వ తరం హైబ్రిడ్ టెక్నాలజీని కలిగి ఉందన్నారు. అత్యాధునికమైన సేఫ్టీ ఫీచర్లు, మెరుగైన ఎక్స్‌టీరియర్స్ ఇంటీరియర్‌లు, సౌకర్యవంతమైన సాంకేతికత అనుసంధానంతో రూపొందించినట్లు తెలిపారు. 2.5 లీటర్ డైనమిక్ ఫోర్స్ ఇంజిన్ ఉందని, ఇది 3200 ఆర్‌పిఎం వద్ద 221 ఎన్.ఎం టార్క్‌ను అందిస్తుందన్నారు.

## డిటి రిపేర్, ఆపరేషన్‌పై వర్క్‌షాప్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఇంటర్నేషనల్ కాపర్ అసోసియేషన్ ఇండియా (ఐసిఎ), ఇండియన్ ట్రాన్స్‌ఫార్మర్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఐటియంఎ) సంయుక్తంగా ఆదివారం విశాఖపట్నంలోని ఎపిఇపిడిసిఎల్ కార్పొరేట్ ఆఫీసులో డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ (డిటి) రిపేర్, ఆపరేషన్ నిర్వహణ కోడ్ ఆఫ్ ప్రాక్టీసెస్‌పై సెమినార్, వర్క్‌షాప్ నిర్వహించారు. డిస్ట్రిబ్యూషన్ కంపెనీలు, డిటి రిపేర్ యూనిట్ల ఎగ్జిక్యూటివ్‌లకు అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సదస్సులో షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ గ్రూప్ సిఇఒ ఎస్పి కొల్లా, ఎనర్జీ రెగ్యులేటరీ వ్యవహారాల సలహాదారు మనస్ కుందు, ఎపిఇపిడిసిఎల్ డైరెక్టర్ వి.విజయలలిత తదితరులు పాల్గొన్నారు.

## క్రెడిట్ కార్డుల జారీలో ఎస్‌బిఐ మైలురాయి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : క్రెడిట్ కార్డు జారీలో ఎస్‌బిఐ 2 కోట్ల కార్డుల మైలురాయిని చేరుకుందని ఎస్‌బిఐ కార్డ్స్ రీజనల్ హెడ్ అభిజిత్ చక్రవర్తి తెలిపారు. సిరిపురంలోని ఎస్‌బిఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా కస్టమర్లకు అందిస్తున్న మెరుగైన సేవలకు ఈ మైలురాయి ఒక నిదర్శనమని చెప్పారు. 1998లో ప్రారంభమైననాటి నుంచి వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా డిజైన్ చేస్తూ విస్తృతమైన ఉత్పత్తులను ప్రవేశపెట్టడంలో ముందంజలో ఉందని తెలిపారు.

## సిపిఎం జిల్లా మహాసభల జయప్రదానికి విస్తృత ప్రచారం



వియ్యపువానిపాలెంలో ప్రచారం చేస్తున్న సిపిఎం నేతలు

**ప్రజాశక్తి -గాజువాక** : ఈనెల 28, 29తేదీల్లో పెందుర్తిలో నిర్వహించనున్న సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం జివిఎంసి 74వ వార్డు వియ్యపువానిపాలెంలో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ఇంటింటా తిరిగి కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. మహాసభల నిర్వహణకు విరాళాలు సేకరించారు.ఈ సందర్భంగా స్టీల్ జోన్ కమిటీ సభ్యులు. జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజా సమస్యల పైనా, . ప్రజలపై భారాలు మోపుతున్న. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటాలు చేస్తున్నదని ఉద్యమ పార్టీ మహాసభల సందర్భంగా ప్రజలందరూ విరివిగా విరాళాలు ఇచ్చి ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు. బి.గురప్ప. సిహెచ్ రాముడు, బి సింహాచలం, బి ఆనంద్, వెంకటరావు, బిఎస్ ప్రసాద్, హెచ్ భానోజీ రావు, అంకంరెడ్డి శ్రీను, సిహెచ్ పైడిరాజు, పాల అప్పల రెడ్డి, జి పెంటారావు, బండి అప్పలరాజు పాల్గొన్నారు.

## నిత్యాన్నదానానికి రూ.లక్ష వితరణ



విరాళం అందజేస్తున్న ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాస్

**ప్రజాశక్తి -తగరపువలస** : సింహాచలం వరహాలక్ష్మీ నరసింహస్వామి శాశ్వత అన్నదాన పథక నిర్వహణకు తమ వంతుగా తగరపువలస, చిట్టివలసకు చెందిన కెజిఎన్ ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ కాళ్ల శ్రీనివాస్ ఆదివారం రూ లక్ష విరాళం అందించారు.. చిట్టివలస నాగవంశ సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు కాళ్ళ గురునాయుడు ద్వితీయ వర్ధంతి సందర్భంగా దేవస్థానం సూపరెంటిండెంట్ విక్రమ్‌రాజుకు విరాళం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సూర్య, పురుషోత్తం, మదన్, దీపక్, గణేష్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదమరిస్తే అంతే సంగతులు!

### ప్రాణాంతకంగా వేలాడుతున్న కేబుల్ వైర్లు



అనంతవరం రైసుమిల్లి సమీపంలో ఉన్న కేబుల్ వైర్లు

**ప్రజాశక్తి -పద్మనాభం:** మండలంలోని అనంతవరం గ్రామానికి వెళ్లిన ఆర్అండ్‌బి రోడ్డుపై వేలాడుతున్న కేబుల్ వైర్లు వాహనదారులకు ప్రాణాంతకంగా మారుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. ఈ మార్గంలో వెళ్లే బస్సులు, లారీలు, ఆటోలు, బైక్‌లు ఇతర వాహనాలతోపాటు పాదచారులు ప్రయాణించే సమయంలో విద్యుత్ స్తంభానికి కట్టిన కేబుల్ వైర్లు ఊడిపోయి వేలాడుతుండడంతో అవి తగులుతుండడంతో ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. దగ్గరకు వచ్చేంత వరకు వేలాడుతున్న వైర్లు కనబడని పరిస్థితి ఉండడంతో వేగంగా ప్రయాణించినా, లేకుంటే ఏమాత్రం ఆదమరిచినా ఆయా వైర్లు తగిలి ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు చొరవచూపి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# సిజిఎం ద్వంద్వ వైఖరి మానుకోవాలి

- అదనపు పనిగంటలకు తక్షణమే పేమెంట్లు చెల్లించాలి
- ఎన్ఎడి కార్మికుల సత్యాగ్రహ దీక్షలో రెడ్డి వెంకటరావు



సత్యాగ్రహ దీక్షాశిబిరంలో మాట్లాడుతున్న రెడ్డి వెంకటరావు

**ప్రజాశక్తి- గోపాలపట్నం** : ఎన్ఎడి కార్మికులతో అదనపు గంటలు పని చేయిస్తే తక్షణమే చెల్లింపులు చేయాలని నావెల్ సివిల్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు రెడ్డి వెంకటరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఎన్ఎడి కార్మికులు చేపట్టిన సత్యాగ్రహ దీక్ష శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనరల్ మేనేజర్‌గా ఉన్నప్పుడు ఎన్ఎడి కార్మికులతో అదనపు పని గంటలు పని చేయించుకున్న, ప్రస్తుత చీఫ్ జనరల్ మేనేజర్, ఇప్పుడు ఆ ఒటి పేమెంట్ ఇవ్వటం చట్టసమ్మతం కాదని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అదే చీఫ్ జనరల్ మేనేజర్ చట్టానికి వ్యతిరేకంగా ఇప్పుడు ఎన్ఎడి కార్మికులతో ఇప్పుడు అదనపు పని గంటలు ఎందుకు పని చేయిస్తున్నారో చెప్పాలని కోరారు. సిజిఎం పరస్పర విరుద్ధమైన చట్ట వ్యతిరేక చర్యలపై తూర్పు నౌకాదళ ప్రధాన అధికారి గౌరవ ఫ్లాగ్ ఆఫీసర్ విచారణ జరిపి తక్షణం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్టోరేజ్ ఒటి ఇవ్వడంతో పాటు 36 మంది సస్పెన్షన్లు, ఆరుగురుపై పోలీస్ కేసు వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు.

నేవల్ కార్మికుల డిమాండ్లు నెరవేర్చే దిశగా యూనియన్లతో వెంటనే చర్చలు జరపాలని, ఏకపక్ష విధానాలు మానుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేకపోతే ఐక్య ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. హెచ్ఆర్ఎ ఒటి లాంటి అంశాలలో విశాఖ రక్షణ రంగ కార్మికులకు వివక్షత జరుగుతోందాన్నరు. సమస్యలు పరిష్కరించమని కోరుతున్న ట్రేడ్ యూనియన్ నాయకులపై నిర్బంధం మానుకోవాలన్నారు. వీటన్నింటిపై త్వరలోనే నేవల్ బేస్ గేటు దగ్గర జన జాగరణ, వంటావార్పు నిరసనలు చేపడతామని హెచ్చరించారు. కేంద్ర ట్రేడ్ యూనియన్ల సహకారంతో ఉద్యమాన్ని జిల్లా వ్యాప్తంగా చేస్తామన్నారు. దీక్షా శిబిరాన్ని నావెల్ సివిల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు కె. శ్రీనివాసరావు,ప్రధాన కార్యదర్శి జి.అరుణ్ కుమార్,జెసిఎం లీడర్ భానుజీ, కార్యదర్శి విశ్వేశ్వరరావు, ఎన్ఎడి ప్రధాన కార్యదర్శి రుత్తల శ్రీనివాస్ సందర్శించి, మాట్లాడారు.

# నిద్రలో కృత్రిమ దంతాలను మింగిన వ్యక్తి

- రిజిడ్ బ్రాంకోస్కొపీతో బయటకు తీసిన కిమ్స్ ఐకాన్ పల్మనాలజిస్టులు



రోగితో డాక్టర్ భరత్

**ప్రజాశక్తి -గాజువాక :** కృత్రిమ దంతాల సెట్‌ను నిద్రలోనే మింగి అస్వస్థతకు గురైన వ్యక్తికి కిమ్స్ ఐకాన్ ఆసుపత్రి పల్మనాలజిస్టులు వైద్యం చేసి ప్రాణాలను కాపాడారు. రిజిడ్ బ్రాంకోస్కొపీ అనే పరికరంతో కుడి ఊపిరితిత్తుల్లో ఇరుక్కున్న పళ్ల సెట్‌ను తీశారు. దీనికి సంబంధించి కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ సిహెచ్ భరత్ తెలిపిన వివరాలివి.

విశాఖపట్నానికి చెందిన 52 ఏళ్ల ఉద్యోగి మూడేళ్ల క్రితం ఎప్పటికీ అతుక్కుని ఉండే కృత్రిమ దంతాలను అమర్చుకున్నారు. నిద్రలో ఉన్న సమయంలో దంతాల సెట్ ఊడిపోగా, దాన్ని మింగేయడంతో నేరుగా ఊపిరితిత్తుల్లోకి వెళ్లి, కుడి వైపు మధ్యభాగంలో ఇరుక్కుంది. అయితే ఎడమ ఊపిరితిత్తి పూర్తిగా పనిచేయడంతో శ్వాస సంబంధిత సమస్యలు తలెత్తనప్పటికీ, బాగా దగ్గు రావడంతో కిమ్స్ ఐకాన్ ఆసుపత్రిని సంప్రదించాడు. ఎక్స్‌రే, సీటీ స్కాన్ చేసి , కుడివైపు ఊపిరితిత్తిలో పళ్ల సెట్ ఉందని గుర్తించిన వైద్యులు, ఆయనకు జనరల్ ఎనస్థీషియా ఇచ్చి, రిజిడ్ బ్రాంకోస్కొపీ అనే పరికరం సాయంతో అత్యంత జాగ్రత్తగా బయటకు తీశారు.

దంతాలసెట్‌కు రెండువైపులా లోహపు వస్తువులు ఉండడంతో వాటివల్ల ఊపిరితిత్తులకు గానీ, శ్వాసనాళానికి గానీ గాయం కాకుండా జాగ్రత్తగా తీసినట్లు డాక్టర్ భరత్ వెల్లడించారు. పళ్ల సెట్ కట్టించుకునేవారు ఎప్పటికప్పుడు దంతవైద్యులను సంప్రదిస్తూ దాన్ని చూపించుకోఎలని, ఇలా నిద్రలో మింగేయడం లోపల ఎక్కువకాలం ఉండిపోతే దానిచుట్టూ కండ పెరిగిపోయి, ఇన్ఫెక్షన్ పెరిగే ప్రమాదముందని డాక్టర్ భరత్ వెల్లడించారు

# గాజువాకలో ఇండోర్ కబడ్డీ స్టేడియం

### ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ చైర్మన్, ఎమ్మెల్యే పల్లా

**ప్రజాశక్తి -గాజువాక :** గాజువాకలో కబడ్డీ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం గాజువాక టిడిపి కార్యాలయంలో పల్లాను ఆంధ్ర రాష్ట్ర, జిల్లా కబడ్డీ అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యాన ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కబడ్డీ పురోభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు చేపడతాననన్నారు. అసోసియేషన్ల మధ్య విబేధాలను పరిష్కరిస్తానని, గతంలో గుంతకల్లులో జరిగిన అసోసియేషన్ రిజిస్ట్రేషన్‌పై విచారణ జరిపించి, నిజమైన క్రీడాసంఘానికి న్యాయం చేస్తానన్నారు.కార్యక్రమంలో రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉరుకూటి శ్రీనివాసరావు, గాజువాక నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ప్రసాదుల శ్రీనివాసరావు, ఉరుకూటి బాబురావు, సిహెచ్ఎన్. మూర్తి, పల్లా రమణ, పల్లా బాబూరావు పాల్గొన్నారు.

## విఆర్ఒలకు ఉద్యోగోన్నతి కల్పించాలి

**ప్రజాశక్తి- భీమునిపట్నం** :అర్హులైన విఆర్ఒలకు ఉద్యోగోన్నతి కల్పించాలని రెవెన్యూ అధికారుల సంఘం ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షులు పోతిన వెంకట అప్పారావు ప్రభుత్వాన్ని కోరారు.ఆదివారం విశాఖ నగరంలోని టర్నర్ చౌల్ట్రీ ప్రాంగణంలో సంఘం ఉమ్మడి విశాఖ జిల్లాస్థాయి సమావేశంలో వెంకట అప్పారావు మాట్లాడుతూ, విఆర్ఒలపై పని ఒత్తిడి తగ్గించాలని, గ్రేడ్ 2 విఆర్ఒలకు డిడిఒలుగా ఉద్యోగోన్నతి కల్పించేందుకు తహశీల్దార్లకు అధికారం ఇవ్వాలని కోరారు. దీనిపై త్వరలో జిల్లా కలెక్టర్‌కు మెమోరాండం సమర్పించాలని సమావేశం నిర్ణయించింది సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి దేవరాజ్, విశాఖ, భీమిలి డివిజన్ కార్యవర్గసభ్యులు, ఉమ్మడి విశాఖ జిల్లా లోని గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు

## నేరాలు ఘోరాలు

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపడిన గుర్తుతెలియని వ్యక్తి

**ప్రజాశక్తి -ఆనందపురం:** భీమిలి క్రాస్ రోడ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడు విశాఖ కేజీహెచ్ లో చికిత్స పొందుతున్నాడు. వివరాలివి.

తగరపువలస నుండి విశాఖపట్నం వెళ్తున్న బొలోరో వాహనం భీమిలి క్రాస్ రోడ్ వద్ద సుమారు 45 నుండి 50 ఏళ్ల వయస్సున్న గుర్తుతెలియని వ్యక్తిని ఢీకొంది ఈ ప్రమాదంలో అతనికి కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు విశాఖ కేజీహెచ్ లో చికిత్స పొందుతున్నాడు. అతను వివరాలు సరిగా చెప్పలేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తిగా స్థానిక పోలీసులు కేసును నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. వ్యక్తి వివరాలు తెలిస్తే స్థానిక పోలీస్ స్టేషన్ నెంబరు 0893322133 సమాచారమివ్వాలని కోరారు. నెంబర్ కు వివరాలు తెలపగలరని పోలీసులు కోరుతున్నారు

## సమాజానికి ఉపయోగపడే సినిమా తీస్తా

**ప్రజాశక్తి -గాజువాక** : సమాజానికి ఉపయోగపడే సినిమా తీస్తున్నట్లు, ఫిలిం డైరెక్టర్ బి జగదీష్ అన్నారు. ఆదివారం గాజువాకలో విలేకరులతో మాట్లాడుతూ, 'మిస్సింగ్ చైల్డ్' పేరుతో కథ రాశానని, రాధాకృష్ణ బ్యానర్‌పైన సినిమా చేస్తున్నట్లు తెలిపారు. తాను పూరి జగన్నాథం, యండమూరి వీరేంద్రనాథ్ దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్ గా పనిచేసిన అనుభవం ఉందన్నారు. న్నదని తెలిపారు. త్వరలో షూటింగ్ ప్రారంభించి, విశాఖ, హైదరాబాద్, భోపాల్‌లలో పలు లొకేషన్లలో చిత్రీకరణ పూర్తిచేసి, వచ్చే నవంబర్‌లో సినిమా విడుదల చేస్తామన్నారు. నిర్మాత జి సురూపరాణి మాట్లాడుతూ, విశాఖపట్నంలో ఉన్న కళాకారులను ఆదుకోవాలని ఉద్దేశంతో తక్కువ బడ్జెట్‌తో తీసే సినిమాను విశాఖ నుంచే మొదలుపెడతానన్నారు. సమావేశంలో పెనుమత్స శ్రీనివాసరాజు, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## 17న జాబ్‌మేళా

**ప్రజాశక్తి -భీమునిపట్నం** : జిల్లా నైపుణ్యాభివృద్ధి. శిక్షణా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 17న మంగళవారం స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి చాముండేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మేధా సర్వో డ్రైవ్, క్లోవ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, అపోలో ఫార్మసీ, ఆస్ట్రా మోటార్స్ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలలో పాల్గొని, ఉద్యోగాలకు అర్హులను ఎంపిక చేస్తారన్నారు. ఐటిఐ ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రీషియన్, మెషినిస్ట్, అలాగే ఇసిఇ, ట్రిపుల్‌ఇ, ఇఐఇబి డిప్లొమా, బిటెక్, బి ఫార్మసీ, డి ఫార్మసీ, ఎంఫార్మసీ, ఎస్ఎస్‌సి, ఇంటర్, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన యువకులు సంబంధిత ఉద్యోగాలకు అర్హులని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు విశాఖ, హైదరాబాద్, కాకినాడలో ఉద్యోగాలు చేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తిగలవారు నైపుణ్యం. ఎపి. జిఒవి.ఇన్ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. స్పాట్ రిజిస్ట్రేషన్‌కు ఆధార్ నంబర్, ఆధార్ అనుసంధానం గల మొబైల్ నెంబర్‌తో ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

## అంబేద్కర్ విగ్రహాలకు రక్షణ కల్పించాలి

**ప్రజాశక్తి -ఆనందపురం :** రాష్ట్రంలో అంబేద్కర్ విగ్రహాలకు రక్షణ కల్పించాలని మాల మహానాడు వ్యవస్థాపకుడు భాగం గోపాలరావు అన్నారు. ఆదివారం మండలంలోని వేములవలస జాతీయరహదారిపై రాస్తారోకో నిర్వహించి, నిరసన చేపట్టారు. ఈసందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ, దేశంలోని పలు రాష్ట్రాల్లో అంబేద్కర్ విగ్రహాల వద్ద ఘోరాలు, అవమానాలు జరుగుతున్నాయని, వాటి నియంత్రణకు చర్యలు చేపట్టాలని కోరారు. దళిత నాయకుడు ఉప్పాడ అప్పారావు, బోని సన్నిబాబు తదితరులు మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహాల వద్ద నిఘా పెట్టి భద్రత కల్పించాలని కోరారు. అంబేద్కర్‌ను అవమానించిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో దళిత నేతలు సియాద్రి రాంబాబు, ఉప్పాడ సత్యనారాయణ, మల్లరపు కృష్ణ, వై. రామారావు, బోని నర్సింగరావు, వెంకన్న, క్రాంతి, గిరిష్ పాల్గొన్నారు.

# విద్యుత్ భారాలపై నిరసన వెల్లువ

## • పలుచోట్ల సిపిఎం ఆధ్వర్యాన కరెంటు బిల్లుల దహనం

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** స్మార్ట్‌మీటర్ల బిగింపు, ట్రూఅప్ పేరుతో విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ సిపిఎం కంచరపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రెడ్డి కంచరపాలెంలో విద్యుత్ బిల్లులు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం కంచరపాలెం జోన్ కార్యదర్శి బొట్టా ఈశ్వరమ్మ మాట్లాడుతూ, రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై ధరాభారం ఎక్కువైందన్నారు. నిత్యావసరాల ధరలు, పన్నుల భారాలతో సతమతమవుతున్న ప్రజలకు విద్యుత్ ఛార్జీలను పెంచి కోలుకోనీయకుండా చేయడం దుర్మార్గమన్నారు. అదానీకి కోట్లలో లాభాలను చేకూర్చే స్మార్ట్‌మీటర్ల బిగింపును ఆపాలని, ట్రూఅప్, సర్దుబాటు, ఇంధన డ్యూటీ పేరుతో పెంచిన విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించు కోవాలన్నారు. లేకుంటే సిపిఎం నేతృత్వంలో రాష్ట్రంలో మరో విద్యుత్ ఉద్యమం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జోన్ నాయకులు ఓ. విజయ, కె.కొండమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.



పెందుర్తి వీరాపాలెంలో సిపిఎం ఆధ్వర్యంలో వినియోగదారుల నిరసన

**పెందుర్తి** :విద్యుత్ చార్జీల భారం, స్మార్ట్ మీటర్ల బిగింపునకు వ్యతిరేకంగా సిపిఎం గోపాలపట్నం జోన్ కమిటీ ఆధ్వర్యంలో జివిఎంసి 97వ వార్డు వీరానగర్‌లో విద్యుత్ బిల్లులు దగ్ధం చేశారు.ఈ సందర్భంగాజోన్ కార్యదర్శి బి.జగన్ మాట్లాడుతూ, రాష్ట్రంలో తెలుగు దేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపైరూ. 18 వేల కోట్లు విద్యుత్ ఛార్జీల భారం వేయడం దుర్మార్గ మన్నారు. స్మార్ట్‌మీటర్లతో వినియోగదారుల ప్రయోజనాల కన్నా, అదానికి మేలు చేకూర్చేలా వ్యవహరించం సరికాదని, ప్రభుత్వ నిర్ణయాలను వెంటనే ఉపసంహరించు కోవాలన్నారు. కార్యక్రమంలో సింహాచ లం అప్పారావు, శ్రీను, ఆనంద్,కాలనీవాసులు పాల్గొన్నారు.




అక్కిరెడ్డిపాలెంలో విద్యుత్ బిల్లులు దగ్ధం చేసిన సిపిఎం కార్యకర్తలు

**గాజువాక :** పెంచిన కరెంట్ బిల్లులు రద్దు చేయాలని కోరుతూ, ఆదివారం అక్కిరెడ్డిపాలెంలో సిపిఎం ఆధ్వర్యంలో కరెంట్ బిల్లులు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ, విద్యుత్‌ఛార్జీలను పెంచబోమని ఎన్నికలకు ముందు హామీనిచ్చిన సిఎం చంద్రబాబు మాట తప్పి ప్రజలను మోసగించారన్నారు. విద్యుత్ ఛార్జీల పెంపు, స్మార్ట్‌మీటర్ల బిగింపు నిర్ణయాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలన్నారు. సిపిఎం జోన్ నాయకులు ఎ.నూకేశ్వర రావు, జె.కోటేశ్వరరావు, బి.సుబ్బన్న పాల్గొన్నారు.

## 'కిస్నా' జ్యువెలరీ షోరూం ప్రారంభం



కిస్నా డైమండ్స్ అండ్ గోల్డ్ జ్యువెలరీని ప్రారంభిస్తున్న ప్రతినిధులు

**ప్రజాశక్తి -గాజువాక** : ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటి కిస్నా డైమండ్ అండ్ గోల్డ్ జ్యువెలరీ ఎక్స్‌క్లూజివ్ షోరూమ్‌ను ఆదివారం విశాఖపట్నం, గాజువాకలో స్థానిక ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు జ్యోతిప్రజ్వళన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పారిశ్రామికంగా, వాణిజ్యపరంగా పురోభివృద్ధి చెందుతున్న గాజువాకలో రాష్ట్రంలోనే మొదటి కిస్నా డైమండ్ అండ్ గోల్డ్ జ్యువెలరీ షోరూం ఏర్పాటు చేయడం శుభ పరిణామమన్నారు. వ్యాపారపరంగా అభివృద్ధి చెంది, వినియోగదారుల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు.

హరికృష్ణ గ్రూప్ వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ ఘనశ్యామ్ ధోలాకియా, పరాగ్ షా మాట్లాడుతూ కిస్నా సంస్థకు దేశంలో 59షోరూంలు ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో మొదటిది, దేశంలో 60వ షోరూంను ఇక్కడ ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. తమ షోరూంలో డైమండ్ జ్యువెలరీపై వందశాతం, బంగారు ఆభరణాలపై 15శాతం మేకింగ్‌ఛార్జీల తగ్గింపు ఇస్తున్నామన్నారు. కిస్నా 'ఆబ్‌కీ బార్ ఆప్ కేలియే షాప్ అండ్ విన్ ఎ కార్' కాంటెస్ట్‌లో కారును గెలుచుకనే అవకాశం ఉందన్నారు. 'హర్ ఘర్ కిస్నా' పేరుతో తాము ప్రతి ఇంటిలో భాగం కావడం లక్ష్యమన్నారు. కిస్నా ఫ్రాంచైజ్ పార్టనర్ రాంబాబు కొత్తపల్లి అండ్ బ్రదర్స్ మాట్లాడుతూ, అసమానమైన డిజైన్‌లు, నైపుణ్యాలతో ఆభరణాల రిటైల్ అనుభవంలో కొత్త ప్రమాణాన్ని నెలకొల్పుతామన్నారు. .

## సమస్యల పరిష్కారానికి కృషి



కండిపిల్లివీధిలో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పల్లా

**ప్రజాశక్తి గాజువాక** : జివిఎంసి 75వ వార్డు కండిపిల్లి వీధిలో ఆదివారం స్థానిక ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పర్యటించారు. స్థానిక ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కనకదుర్గమ్మ ఎదురుగా మండపం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈనెల 17న పెదగంట్యాడ తహసీల్దార్ కార్యాలయం వద్ద రెవిన్యూ సదస్సు జరుగుతుందని, సమస్యలున్న వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, 64వ వార్డు కార్పొరేటర్ దళ్ళి గోవిందరెడ్డి, విశాఖ పార్లమెంటరీ టిడిపి ఉపాధ్యక్షులు పులి వెంకటరమణారెడ్డి, పెద్దాడ సోము నాయుడు, స్థానికులు తెప్పల దుర్యోధన, లక్ష్మి పాల్గొన్నారు.

## ఇంధన పొదుపుపై అవగాహన

**ప్రజాశక్తి -తగరపువలస** : స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 21 వరకు నిర్వహించనున్న ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పలు అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథి సెయిల్ విశాఖ జనరల్ మేనేజర్ టి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఇంధన వినియోగం, వాతావరణ మార్పులను తగ్గించడానికి గల అవకాశాలను వివరించారు. అవంతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ లో అందుబాటులో ఉన్న ఎల్ఇడి లైటింగ్, సాంకేతిక పరికరాల వినియోగంపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి మురళీకృష్ణ, ఐఐసి కన్వీనర్ షరీఫ్, డిప్లొమా విభాగం ఇన్‌ఛార్జి జగదీష్, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు. అనంతరం సెయిల్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌ను అధ్యాపకులు సత్కరించారు

# సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

## • విశాఖ డెయిరీ యాజమాన్యాన్ని కోరిన సిఐటియు నేత రాంబాబు



డెయిరీ కార్మికుల దీక్షల్లో పాల్గొన్న రాంబాబు

**ప్రజాశక్తి -గాజువాక** : విశాఖ డెయిరీ కార్మిక సమస్యలు పరిష్కారానికి యాజమాన్యం చొరవ చూపాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎంరాంబాబు డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారానికి విశాఖ డెయిరీ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ ఆధ్వర్యంలో విశాఖ డెయిరీ వద్ద కార్మికులు చేపడుతున్న రిలేదీక్షలు ఆదివారం 25వ రోజుకు చేరుకున్న సందర్భంగా శిబిరాన్ని సందర్శించిన రాంబాబు మాట్లాడుతూ, డెయిరీ కార్మికులకు కనీస వేతనం రూ.21వేలు చెల్లించాలని, డెయిరీ ఉద్యోగులు, కార్మికులను పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. విశాఖ జిల్లా జాయింట్ లేబర్ కమిషనర్, డెయిరీ యాజమాన్యం స్పందించి, కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు.కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్ రమణ, కార్మికులు పాల్గొన్నారు.

## చురుగ్గా టిడిపి సభ్యత్వ నమోదు

**ప్రజాశక్తి - ఆరిలోవ :** తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు ఆదేశాలతో 10వ వార్డు టిడిపి మద్దిల రాజశేఖర్ అధ్వర్యంలో ఆదివారం వివేకానంద నగర్‌లో టిడిపి సభ్యత్వ నమోదు చేపట్టారు. తెలుగుదేశం కార్యకర్తలు, సానుభూతిపరులు పెద్దసంఖ్యలో పాల్గొని పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. కార్యక్రమంలో వార్డు ప్రెసిడెంట్ గాడు అప్పలనాయుడు, క్లస్టర్ ఇంచార్జి మద్దిల రాజేష్, బూత్ కన్వీనర్స్ సిహెచ్.అప్పలనాయుడు, బుగత తాతారావు, ఖాదర్ భాషా, కాళ్ళ శ్రీనివాసరావు, భాస్కరరావు, గురునాథరావు, కాళ్ల అప్పలరాజు, తలాడ లక్ష్మణరావు, బోని చంటి, శ్రీనివాసరావు పాల్గొన్నారు

# లక్ష్మి విజయ మెడికేర్ ఆసుపత్రి ప్రారంభం



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న విజయనగరం ఎమ్మెల్యే అదితి

**ప్రజాశక్తి -తగరపువలస**: జివిఎంసి ఒకటో జోన్ తగరపువలస, సంగివలసలో లక్ష్మివిజయ మెడికేర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను విజయనగరంఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు ఆదివారం ప్రారంభించారు. ఆసుపత్రిలో అత్యాధునిక సదుపాయాల కల్పనపై సంతృప్తి వ్యక్తపరిచారు.

వైద్యుల ఛాంబర్‌ను, ఐసియు, ఆపరేషన్ థియేటర్‌ను స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కుమారుడు రవి తేజ ప్రారంభించారు. ముందుగా హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్లు డాక్టర్ డివి రామభద్రరాజు, డాక్టర్ రమ్య వత్సవాయి అతిథులకు పుష్పగుచ్ఛాలను అందజేసి స్వాగతం పలికారు.ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో వివిధ ప్రైవేట్ ఆసుపత్రుల వైద్యులు, టిడిపి మండల అధ్యక్షులు డిఎన్ రాజు, పిఎస్ఎస్ అధ్యక్షులు అక్కరమాని రామునాయుడు, టిడిపి నాయకులు గాడు అప్పలనాయుడు, పలువురు మాజీ, తాజా సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అతిథులను ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్లు ఘనంగా సత్కరించారు.



వైద్యుల ఛాంబర్‌ను ప్రారంభిస్తున్న గంటా రవితేజ

## అపూర్వ కలయిక



ఒకే చోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు

**ప్రజాశక్తి -తగరపువలస** : చిట్టివలస జెడ్‌పి హైస్కూల్ 1992 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు స్థానికప్రైవేట్ రిసార్ట్‌లో ఆదివారం కలుసుకున్నారు. చదువుకున్న నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఆత్మీయంగా ఒకరిని మరొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. కష్ట సుఖాలను అడిగి తెలుసుకున్నారు.వీరంతా స్థానికంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రాబోయే కాలంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రకటించారు. ఆట, పాటలతో పూర్వ విద్యార్థులంతా ఆద్యంతం ఉత్సాహ పూరిత వాతావరణంలో గడిపారు. క్విజ్, ఆటలు, పాటల పోటీల్లో పాల్గొని, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు . కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీనివాస పాత్రో,బడిగింటి మహేశ్వరరావు, సిరువూరి శ్రీనివాసవర్మ, పిట్ట శ్రీనివాసరావు, అక్కర మాని చిన బాబు, మద్దిల సుబ్బారావు పాల్గొన్నారు

## 'శిల్పారామం'లో అలరించిన నృత్యాలు



నటరాజ నృత్యాలయం కళాకారుల ప్రదర్శన

**ప్రజాశక్తి -మధురవాడ** : శిల్పారామం జాతరలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన శాస్త్రీయ, జానపద నృత్యప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. విశాఖపట్నం నటరాజ నృత్యాలయం కళాకారుల నృత్యప్రదర్శన ప్రేక్షకులను రంజింపజేసింది..ముందుగా బ్రహ్మాంజలి,మరకతమయ తరంగం, భామా కలాపం, బుల గలల తరంగం వంటి కీర్తనలకు హాసిని, మోక్షిత్, గున్వాక్, చిన్మయి, సౌజన్య, గామిని, సాధ్వి, యస్మిత్ నక్షత్ర, లిఖిత, దీపిక, నేత్రశ్రీ లయబద్ధంగా చేసిన నృత్య ప్రదర్శన ప్రేక్షకులను కట్టిపడేశాయి. కార్యక్రమాన్ని శిల్పారామం పరిపాలన అధికారి టి. విశ్వనాథరెడ్డి పర్యవేక్షించారు

# పరీక్షల సమయంలో ట్రైనింగ్ సరికాదు

## యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నబ్బాయి

**ప్రజాశక్తి-అనకాపల్లి**

సమ్మేటివ్ పరీక్షలు జరుగుతున్న సమయంలో నాయకత్వ శిక్షణ తరగతుల పేరుతో అనకాపల్లి జిల్లా ఉపాధ్యాయులకు విజయనగరం జిల్లాలో శిక్షణ ఇవ్వడం సరికాదని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి అన్నారు. అనకాపల్లి సిఐటియు కార్యాలయంలో ఆదివారం జరిగిన యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశంలో విద్యాశాఖ అధికారుల వైఖరిని నిరసించారు. సమావేశం ప్రారంభంలో ఇటీవల మరణించిన టీచర్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చిన్నబ్బాయ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు ఈనెల 11వ తేదీ నుంచి 19వ తేదీ వరకు సమ్మేటివ్ పరీక్షలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్య చాలా తక్కువగా ఉందని, ఏకోపాధ్యాయ పాఠశాలలు చాలా ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ఈ తరుణంలో ఉపాధ్యాయులను శిక్షణా తరగతులలో నిమగ్నం చేస్తే పాఠశాలల్లో పిల్లలకు పరీక్షలు ఎవరు నిర్వహిస్తారని ప్రశ్నించారు. పరీక్ష పూర్తయిన రెండు రోజుల్లో పేపర్లు దిద్ది ఆన్లైన్లో మార్కులు కూడా నమోదు చేయాలని ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఆదేశించారని పేర్కొన్నారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో వారం రోజులు పాటు ఉపాధ్యాయులకు నాయకత్వ శిక్షణ పేరుతో పాఠశాలలకు దూరం చేయడం వలన ఈ పనులు ఎవరు చేస్తారని ప్రశ్నించారు. 10 శాతానికి మించి ఉపాధ్యాయులు సెలవులు పెట్టరాదనే ఆంక్షలు ఉపాధ్యాయులపై రుద్దుతున్నారని తెలిపారు. పదవ తరగతి పరీక్షలకు సంసిద్ధత పేరుతో ఇటీవల రాష్ట్ర ఎస్సీఈఆర్టీ అధికారులు విడుదల చేసిన 100 రోజుల యాక్షన్ ప్లాన్లో భాగంగా ఉపాధ్యాయులను సెలవు రోజుల్లో కూడా పాఠశాలలకు రమ్మనడం సరికాదని పేర్కొన్నారు. సంక్రాంతి సెలవుల్లో కూడా ఉపాధ్యాయులు పాఠశాలల్లో పని చేయాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఒకపక్క విద్యార్థులకు సెలవుల్లో ఏ రకమైన తరగతులు నిర్వహించరాదనే నిబంధనలు ఉన్నప్పటికీ, సెలవుల్లో క్లాసులు పెట్టమనడం



మాజీ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నేతలు

విచిత్రంగా ఉందని వ్యాఖ్యానించారు. రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఈ అసంబద్ధ నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని లేని పక్షంలో అన్ని ఉపాధ్యాయ సంఘాలతో కలిపి ఉద్యమాన్ని చేపడతామని, శిక్షణ తరగతులను బహిష్కరిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూటీఎఫ్ అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి, గౌరవ అధ్యక్షులు వెంకట్రావు, సహఅధ్యక్షులు రొంగలి అక్కునాయుడు, జిల్లా కార్యదర్శులు పొలిమేర చంద్రరావు, కళింగ సతీష్, శేషు కుమార్, కోశాధికారి జోగా రాజేష్, రాష్ట్ర కౌన్సిలర్ ఎల్లయ్య బాబు, సీనియర్ నాయకులు శాస్త్రి, దేవుడు నాయుడు, రాణి, శ్రీను, నానాజీ, అనిమిరెడ్డి సాంబమూర్తి, కుదర కామరాజు, వెంకట్, గొంది ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

### అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన

## ఉచిత కంటి వైద్య శిబిరం

**ప్రజాశక్తి-కె.కోటపాడు :** మండలంలోని ఆనందపురం గ్రామంలో అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సహకారంతో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన 64 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, ఐ డ్రాప్స్ అందించారు. 30 మంది రోగులను కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసి ఆపరేషన్ నిమిత్తం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి బస్సులో తరలించారు. శంకర్ ఫౌండేషన్ వైద్య నిపుణులు డాక్టర్ అరుణ, క్యాంపు మేనేజర్ అరుణ్ కుమార్, స్థానిక సర్పంచ్ వంటాకు అప్పాజీ, అమ్మ చారిటుబుల్ ట్రస్ట్ చైర్మన్ గొంప వెంకట్రావు, ట్రస్టు ప్రతినిధులు దొగ్గ సత్యనారాయణ మూర్తి, సూరెడ్డి బాబురావు భోజంకి సూర్యనారాయణ, సింగంపల్లి అర్జున, సింగంపల్లి అచ్చిబాబు, కర్రి ధారా ప్రసాద్, లెక్కల సత్యనారాయణ, సింగంపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

### మాజీ ఎంపీపీ కొణతాల బాబూరావు విగ్రహావిష్కరణ

**ప్రజాశక్తి-అనకాపల్లి :** మాజీ ఎంపీపీ, రాజుపాలెం శ్రీసూర్యనారాయణ ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొణతాల బాబూరావు విగ్రహాన్ని జీవీఎంసీ 80వ వార్డు విలీన గ్రామమైన రాజుపాలెంలో ఆదివారం శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సంస్మరణ సభలో వారు మాట్లాడుతూ ఎంపీపీగా, ఆలయ చైర్మన్గా చేసిన అభివృద్ధిని కొనియాడారు.

### ఆత్మీయ విద్యార్థి సేన ఆధ్వర్యాన రక్తదానం

**ప్రజాశక్తి-అనకాపల్లి :** ఆత్మీయ విద్యార్థి సేన ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేశారు. మామిడిపాలెం హైస్కూల్లో చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సేనగా ఏర్పడి ఆదివారం ఎన్టీఆర్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో సుమారుగా 100 మంది రక్తదానం చేశారు. ఇంతవరకు ఆరుసార్లు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసినట్లు సేన అధ్యక్షుడు పల్లా రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో సేన గౌరవ అధ్యక్షుడు కేవీనల్ ప్రసాద్ మాస్టారు, అధ్యక్షుడు పల్లా రాజు, ప్రధాన కార్యదర్శి గొల్లవిల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు తోటాడ సింహాచలం, ఉప కార్యదర్శి పిల్లా సురేష్, కోశాధికారి వునుకూరి కృష్ణ, ఉప కోశాధికారి మొల్లి మురళి, ఆత్మీయ గురువులు రమాదేవి, అప్పలమూర్తి, రమేష్, కొండలరావు, ఆత్మీయ కమిటీ సభ్యులు ఆళ్ల శ్రీనివాస్, కోరువాడ వెంకటేశ్వరావు, హనుమంతు, ముత్తురెడ్డి రమేష్ పాల్గొన్నారు.

### విద్యుత్ పొదుపుపై అవగాహన

**ప్రజాశక్తి-చోడవరం :** విద్యుత్ పొదుపు భావితరాలకు మదుపు అని ఏపీఈపీడీసీఎల్ ఏడి యు.గౌరీ ప్రసాద్ అన్నారు. స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద వినియోగదారులకు విద్యుత్ పొదుపుపై ఆదివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్తును ఆదా చేయడం వలన బిల్లులు తగ్గడమే కాకుండా భావితరాలకు మంచి భవిష్యత్తును అందించవచ్చని చెప్పారు. విచ్చలవిడిగా విద్యుత్ వినియోగం వలన ఆర్థిక నష్టంతో పాటు ఇబ్బందులు తలెత్తుతాయని చెప్పారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా ప్రజలను చైతన్యవంతులు చేయడానికి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఏఈలు, లైన్మాన్తో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఇపిడిసిఎల్ ఎడి గౌరీ ప్రసాద్

### శీతాకాలంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

**ప్రజాశక్తి-అనకాపల్లి :** శీతాకాలంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రముఖ వైద్యులు డిడి నాయుడు అన్నారు. వాకర్స్ క్లబ్, అనకాపల్లి సర్వసభ్య సమావేశం ఆదివారం క్లబ్బు కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా నాయుడు "శీతాకాలం - తీసుకోవలసిన జాగ్రత్తలు" అనే అంశంపై వివరించారు. ప్రతి రోజు నడక, యోగా చేయడం ద్వారా అనేక శారీరక రుగ్మతలను నయం చేసుకోవచ్చని చెప్పారు.

**నూతన కార్యవర్గం ఎన్నిక**

తదనంతరం 2025 సంవత్సరం వాకర్స్ కొత్త పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా రాపేటి నారాయణ రావు, కార్యదర్శిగా యల్లపు సాంబశివారావు(శివ), కోశాధికారిగా కాండ్రేగుల సత్యనారాయణ, కుండల రామకృష్ణ ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో యల్లపు శివ, ఆడారి మల్లికార్జునరావు, నల్లల దేవుళ్ళు, చవితిన నరసింగరావు, ఎంటీ రామారావు, బుద్ధ కాశీ విశ్వేశ్వరరావు, దాడి సూరిబాబు, పీలా అరుణాచలం పాల్గొన్నారు.

### ఉత్సాహంగా ఉపాధ్యాయుల వన సమారాధన

**ప్రజాశక్తి-అనకాపల్లి :** అనకాపల్లి మండల పరిధిలోని కొప్పాక, మర్రిపాలెం, తారకరామ కాలనీ, సీహెచ్ఎన్ అగ్రహారం ఉన్నత పాఠశాలల స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, సిబ్బందితో ఆదివారం వన సమారాధన కార్యక్రమం జరిగింది. పలు పర్యాటక, ఉద్యాన కేంద్రాలను సందర్శించి, సమీపంలో ఉన్న తోటలో వీరంతా సమావేశం నిర్వహించారు. వీరి పరిధిలో ఉన్న పాఠశాలల అభివృద్ధి, విద్యాభివృద్ధి, విద్యార్థుల హాజరు పెంపు, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక చర్యలు తదితర అంశాలపై వీరంతా చర్చించారు. మండల విద్యాశాఖ అధికారులకు నివేదికను అందజేశారు.

### గ్రీన్ క్లబ్ సేవలు ప్రశంసనీయం

**ప్రజాశక్తి-అనకాపల్లి :** అనకాపల్లి గ్రీన్ క్లబ్ సేవలు ప్రశంసనీయమని పట్టణ సీఐ విజయ్ కుమార్ పేర్కొన్నారు. గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం వాక్ ఫర్ గ్రీన్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రేబాక మధుబాబుతో కలిసి ఆయన జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణ కోసం గ్రీన్ క్లబ్ గత కొన్ని ఏళ్లుగా సేవలు అందించడం గర్వకారణమన్నారు. చెట్లను నాటడం అడవులను పరిరక్షించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోగలమని చెప్పారు. ఈ సందర్భంగా రింగ్ రోడ్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో గ్రీన్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు కొణతాల ఫణి భూషణ్ శ్రీధర్, శంకర్ల పద్మలత, బొడ్డేడ జోగినాయుడు, మాజీ అటవీశాఖ అధికారి బేరా వినోద్ కుమార్, పెంటకోట ఉమామహేశ్వరరావు, పేరూరి చిన్నస్వామి, బేతాళం శేష సాయి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న సిఐ విజయ్ కుమార్

## ట్రూ ఆఫ్ ఛార్జీలను రద్దు చేయాలి



కరపత్ర ప్రచారం చేస్తున్న పౌరు సంక్షేమ సంఘం నాయకులు

**ప్రజాశక్తి-అనకాపల్లి**

ప్రజలపై భారాలు పెంచే స్మార్ట్ మీటర్లను బిగించవద్దని, వినియోగదారులపై వేసే అదనపు ట్రూ ఆఫ్ చార్జీలను, ఎఫ్ఎఫ్ చార్జీలను రద్దు చేయాలని పౌర సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం నాయుకలు ఆదివారం ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. గవరపాలెం సంతోష్ మాత గుడి ప్రాంతంలో పెద్ద ఎత్తున మహిళలు నిరసనలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు కే.తేలయ్యాబాబు, పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ట్రూ ఆఫ్ చార్జీలు కింద ఇప్పటికే కట్టించుకున్న సొమ్మును తిరిగి ఇవ్వాలని, బిగించిన స్మార్ట్ మీటర్లను వెంటనే తీసివేయాలని డిమాండ్ చేశారు. గతంలో అనేక పోరాటాలు ఫలితంగా చెత్త సేకరణ చార్జీలను రద్దు చేయించుకున్నామని గుర్తు చేశారు. ఇదే విధంగా ఈ స్మార్ట్ మీటర్ల బిగింపు విషయంలో కూడా ప్రతి ఒక్కరూ ఈ నిరసనలో పాల్గొని స్మార్ట్ మీటర్లు బిగించుకోకుండా ప్రయత్నం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జునరావు, పెంటకోట శ్రీనివాసరావు, బొడ్డేడ శ్రీనివాసరావు, స్థానిక, నాయకులు వరలక్ష్మి, విజయ పాల్గొన్నారు.

## 21 నుంచి జార్జిక్లబ్లో నాటకోత్సవాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

**ప్రజాశక్తి-అనకాపల్లి :** అనకాపల్లి జార్జి క్లబ్ కొణతాల వెంకటనారాయణమ్మ కళా ప్రాంగణంలో ఈనెల 21 నుంచి 23 వరకు జరుగు ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటక ఉత్సవాలను విజయవంతం చేయాలని శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, రాష్ట్ర అర్బన్ డెవలప్మెంట్ మౌలిక సదుపాయాల కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ పేర్కొన్నారు. జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం నాటకోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాటకోత్సవాల కన్వీనర్ కెయం నాయుడు మాట్లాడుతూ అనకాపల్లి జార్జి క్లబ్, కళా విపంచి హైదరాబాద్, తెలుగు డ్రామా హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో ఆహ్వాన నాటక ఉత్సవాలు జరుగుతున్నాయన్నారు. ప్రతిరోజు సాయంత్రం 6.30 నుంచి 9 గంటల వరకు రెండు నాటికల ప్రదర్శన ఉంటుందన్నారు. ఈనెల 21న హైదరాబాద్ మహతి క్రియేషన్స్ వారి ఉక్కు సంకెళ్లు, రెండవ ప్రదర్శనగా విశాఖ ఉక్కునగరం చైతన్య కళా స్రవంతి వారి (అ)సత్యం, 22వ తేదీన గుంటూరు జిల్లా తాడేపల్లి అరవింద ఆర్ట్స్ వారి విడాకులు కావాలి, రెండో ప్రదర్శనగా బాపట్ల జిల్లా ద్రోణాదుల సహృదయ వారి వర్క్ ఫ్రం హోం, ఈనెల 23న అనకాపల్లి శ్రీ షిరిడి సాయి కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి వేదాంతం, రెండో ప్రదర్శనగా ఉత్తరాంధ్ర శ్రీ సౌజన్య కళ స్రవంతి వారి దేవరాగం నాటికలు ప్రదర్శించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా పలువురికి బొప్పన ఆత్మీయ పురస్కారాలు అందజేయడం జరుగుతుందన్నారు. కళాభిమానులు ఈ నాటకోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జార్జి క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి బిఎస్ఎంకె జోగి నాయుడు, బుద్ధ కాశీ విశ్వేశ్వరరావు, విల్లూరి చంద్రశేఖర్, పగడాల వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి సంఘాల అధ్యక్షులకు సత్కారం

**ప్రజాశక్తి-సబ్బవరం**

మండలంలోని సాగునీటి సంఘాల అధ్యక్షులుగా ఎన్నికైన వారు ఆదివారం స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబును, పెందుర్తి టీడీపీ ఇన్‌ఛార్జి గండి బాబ్జిలను మర్యాద పూర్వకంగా కలిశారు. వారిని ఎమ్మెల్యే పంచకర్ల, గండి బాబ్జిలు అభినందించి సత్కరించారు. అయ్యన్నపాలెం భూదేవి చెరువు సంఘం అధ్యక్షుడిగా దొగ్గ కనక చంద్రినాయుడు, బోదివలస నందమూరివాని చెరువు సంఘం అధ్యక్షుడిగా దారపు దేముడు, కంచిపాటు చెరువు సంఘం అధ్యక్షుడిగా బుదిరెడ్ల ఈశ్వరరావు, నారపాడు తమురు చెరువు సంఘానికి అధ్యక్షుడిగా అప్పలరాజు, ఇరువాడ బోనివానిచెరువు సంఘానికి అధ్యక్షుడిగా మామిడి అర్జున, మల్లునాయుడుపాలెం మావూళ్లు చెరువు సంఘం అధ్యక్షుడిగా గండి పెంటయ్య, సబ్బవరం పోతురాజు చెరువు సంఘం అధ్యక్షుడిగా కొటాన సన్నిబాబు, ఉపాధ్యక్షులుగా పోతల సత్యనారాయణ, నల్లరేగులపాలెం విజయరామసాగరం చెరువు సంఘం అధ్యక్షుడిగా కాయిత రమణ, అంతకాపల్లి రాజుచెరువు అధ్యక్షుడిగా చిటిమిరెడ్డి అప్పలనాయుడు, పెద్దచెరువు సంఘం అధ్యక్షురాలుగా సబ్బవరపు లక్ష్మీ, టెక్కలిపాలెం ముసిడిబంద సంఘం అధ్యక్షుడిగా వర్రి అప్పలనాయుడు, పైడివాడ కంసాలబంద చెరువు అధ్యక్షుడిగా మజ్జి చంద్రశేఖర్, మొగలిపురం నేరేళ్లచెరువు సంఘం అధ్యక్షుడిగా బండారు దేముడు, మల్లునాయుడు చెరువు అధ్యక్షుడిగా గురి సత్తిబాబు, పెదిబట్లవాని చెరువు సంఘం అధ్యక్షుడిగా పైల బంగారునాయుడు, గొటివాడ సూరపురాజు చెరువు సంఘం అధ్యక్షుడిగా సాలాపు సూరిబాబు, బాటజంగాలపాలెం బడిబంద సంఘం అధ్యక్షుడిగా తాడి పైడిరాజు, పేరయ్యదేవుడు చెరువు సంఘం అధ్యక్షులుగా దొగ్గ సింహాచలం, అమృతపురం రాజుచెరువు సంఘం అధ్యక్షుడిగా బోకం శ్రీరామమూర్తి, పుచ్చవాన చెరువు సంఘం అధ్యక్షుడిగా బోకం బాలకృష్ణ, హరప్ప చెరువు సంఘం అధ్యక్షులుగా బోకం పైడితల్లి, పెదగొల్లలపాలెం రాయపురాజు చెరువు అధ్యక్షరాలుగా మజ్జి మంగమ్మ, బొబ్బిడి చెరువు అధ్యక్షుడిగా ఉప్పులి అప్పారావు ఎన్నికయ్యారు.

**అనకాపల్లి :** అనకాపల్లి నియోజకవర్గంలో సాగు నీటి కాలువలు, చెరువులు, గ్రోయిన్లు మరమ్మతులకు, అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు తుమ్మపాల, సిహెచ్ఎన్ అగ్రహారం, బట్లపూడి, పాపయ్య సంతపాలెం, ఎల్లయ్య కాలువ, చెర్లోపల్లి సాగు నీటి సంఘాల అధ్యక్షులు, పీలా సీతారాం, సభ్యులను సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ భీమరశెట్టి రాంకీ, కూటమి నాయకులు గొంతిన శ్రీనివాసరావు, కర్రి బాబీ, ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు, బీఎస్ఎంకే జోగి నాయుడు, భరత్ బాబు, పీలా గొల్ల బాబు, తలారి కాశీ నాయుడు, బంటు రవి, ఆడారి గోవిందరావు, త్రినాధ్ తదితరులు పాల్గొన్నారు.



సాగునీటి సంఘాల అధ్యక్షులను సన్మానిస్తున్న గండి బాబ్జి



సభ్యత్వ నమోదు చేస్తున్న టిడిపి నాయకులు

## టిడిపి సభ్యత్వ నమోదు

**ప్రజాశక్తి-మునగపాక :** మండలంలోని తోటాడ గ్రామంలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం మండల టిడిపి అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి నుండి తెలుగుదేశం పార్టీ పేదవాళ్ల పక్షానే నిలబడిందని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ దొడ్డి రమేష్, ఆవ కాలువ చైర్మన్ జెకె నాయుడు, పి మురళి, చదరం భాస్కర్‌రావు, పెంటకోట గణేష్, పి బాలు తదితరులు పాల్గొన్నారు.

## సత్యనారాయణస్వామిని దర్శించుకున్న రాంకీ

**ప్రజాశక్తి-అనకాపల్లి :** జనసేన పార్టీ అనకాపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ భీమరశెట్టి రాంకీ ఆదివారం సుంకరమెట్ట సత్యనారాయణ స్వామి దేవస్థానం స్వామి వారిని దర్శించుకున్నారు. దేవస్థానం చైర్మన్ బొడ్డేడ మురళి ఆహ్వానం మేరకు దేవస్థానానికి విచ్చేసిన రాంకీకి, విశాఖ అర్బన్ ఉపాధ్యక్షులు బొడ్డేడ జోగి నాయుడుకి స్వామివారి దగ్గర ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ విల్లూరి, జగన్నాథ స్వామి దేవస్థానం చైర్మన్ దాడి బుజ్జి, సంతోషిమాత దేవస్థానం చైర్మన్ మారిశెట్టి భాస్కరరావు, ఎల్లయ్య కాలువ చైర్మన్ బుద్ధ మహాలక్ష్మీ నాయుడు, చెర్లోపలి కాల్వ వైస్ చైర్మన్ విల్లూరి మాధవ, ధర్మకర్తలు మారిశెట్టి భాస్కరరావు పెంటకోట చందర్రావు, సూరిశెట్టి బల్లమ్మ, శ్రీకాకుళం గణపతి, తురకలపూడి ఈశ్వరరావు, ఎల్లపు శ్రీనివాసరావు, పీలా హరి, కాండ్రేగుల సురేష్, ఆళ్ల జగది, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

## ధనుర్మాస పూజలకు కేశవస్వామి ఆలయంలో ఏర్పాట్లు

**ప్రజాశక్తి- కె.కోటపాడు :** ధనుర్మాసం సోమవారం నుండి ప్రారంభం కానున్న నేపథ్యంలో మండలంలోని మేడచెర్లలోని భూదేవి నీలాదేవి సమేత కేశవస్వామి ఆలయంలో భక్తుల పూజల కోసం ఏర్పాట్లు చేశారు. సోమవారం నుండి ప్రతిరోజు ఉదయం నాలుగు గంటలకు స్వామివారి సుప్రభాత సేవ పల్లకి సేవ అనంతరం నగర సంకీర్తన జరుగుతుంది. జనవరి 13వ తేదీ భోగి వరకు ఈ పూజా కార్యక్రమాలు ఉంటాయి. జనవరి 10న వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం ప్రత్యేక పూజలు ఉంటాయని ఆలయ అర్చకులు తాతా వెంకటరమణమూర్తి శర్మ తెలిపారు.

## ఆధ్యాత్మిక కేంద్రంగా అమరపురి అభివృద్ధికి సహకారం

**ప్రజాశక్తి బుచ్చయ్యపేట :** మండలంలోని కొమల్లపూడి దరి అమరపురి ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చెందడానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు తెలిపారు. అమరపురి జ్యోతిర్మయి బాబా జన్మదిన వేడుకలు విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే రాజు, అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్ సతీమణి శ్రీదేవి, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు గూనూరు మల్లు నాయుడు, చోడవరం, బుచ్చయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాల నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజు తదితరులు

## అడవుల్లో అగ్ని ప్రమాదాలపై సమాచారం అందించండి

**ప్రజాశక్తి-చోడవరం :** అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు అందరూ సహకారం అందించాలని చోడవరం అటవీశాఖ రేంజ్ అధికారి ఇవి రవివర్మ విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ అడవుల్లో అటవీ పనుల మీద తిరిగే స్థానికులు, అటవీ సందర్శనకు వెళ్లే వ్యక్తులు నిర్లక్ష్యంగా సిగరెట్టు, బీడీ, చుట్ట వంటివి కాల్చి పారేయడంతో మంటలు అంటుకొని అడవుల్లో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. అవగాహన లేకుండా చేసే ఇలాంటి పనుల వలన అడవుల్లో విలువైన చెట్లు వన సంపద నాశనమయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఆయా పంచాయతీల పరిధిలోని కార్యదర్శులు వన సంరక్షణ సమితి సభ్యులు కూడా అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

**టోల్ ఫ్రీ నెంబర్లు ఏర్పాటు**

అడవుల అగ్ని ప్రమాదాలు సంభవిస్తే ఆ సమాచారం టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేసి సహకరించాలని రేంజ్ అధికారి రవివర్మ విజ్ఞప్తి చేశారు. టోల్ ఫ్రీ నెంబర్ 1800-425-5909, చోడవరం రేంజ్ ఆఫీసర్-9441469400, చోడవరం డిప్యూటీ రేంజ్ ఆఫీసర్-9491872256, చోడవరం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ -9493434910 నెంబర్లకు సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు.

## విజయసాయిరెడ్డిని కలిసిన గండి రవికుమార్

**ప్రజాశక్తి-సబ్బవరం :** విశాఖపట్నం వైసిపి నూతన కార్యాలయానికి విచ్చేసిన రాజ్యసభ సభ్యులు, ఆ పార్టీ ఉత్తరాంధ్ర రీజినల్ కో ఆర్డినేటర్ విజయసాయిరెడ్డిని పార్టీ జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్నాథ్ ఆధ్వర్యంలో ఆదివారం పెందుర్తి నియోజకవర్గం వైస్సార్సీపీ నాయకులు గండి రవికుమార్ మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆయనను దుస్సాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యువజన విభాగం అధ్యక్షులు యడ్ల నాయుడు, ఉప సర్పంచ్ సిరపరపు వాసు, ఐడి బాబు, గండి రవికుమార్ యువసైన్యం సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా గొర్లి స్వామిగౌడ్ జన్మదిన వేడుకలు

**ప్రజాశక్తి-అనకాపల్లి :** అనకాపల్లి పట్టణంలో ప్రముఖ వ్యాయామశాల అవినాష్ పవర్ జిమ్ ప్రధాన శిక్షకులు గొర్లి స్వామి గౌడ్ జన్మదిన వేడుకలు ఆదివారం జిమ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిమ్ వ్యవస్థాపకుడు, న్యాయవాది ఐఆర్.గంగాధర్ మాట్లాడుతూ 11 సంవత్సరాలుగా అవినాష్ పవర్ జిమ్ కోచ్‌గా అనేక మంది యువతీ, యువకులకు శారీరక దారుఢ్యంలో శిక్షణ ఇచ్చి రాష్ట్ర, జాతీయ పోటీలలో పాల్గొని, పతకాలు సాధించే విధంగా తీర్చిదిద్దారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అవినాష్ ఇళ్ల, గంటా సురేష్, సీనియర్ జిమ్ సభ్యులు బుద్ధ గణేష్, పిట్ల రాజు, గండిబోయిన శ్రీనివాసరావు, అయినాల కృష్ణ, ఆకుల యశ్వంత్, సుంకర తేజ పాల్గొన్నారు.

## పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

**ప్రజాశక్తి-సబ్బవరం :** మండలంలోని ఇరువాడ పంచాయతీ పరిధిలో ఉన్న కృపా సహకార కేంద్రంలో గ్రేస్ ఆఫ్ గాడ్ ట్రస్ట్ చైర్మన్ పువ్వల విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రతినెల నిర్వహిస్తున్న హత్తుకునే చేతులు కార్యక్రమంలో భాగంగా క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 30 మంది నిరుపేదలకు, వికలాంగులకు, వృద్ధులకు, వితంతువులకు 5 కేజీ రైస్ బ్యాగ్, దుప్పటి పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్రదర్ ఇస్సాకు, మ్యాత్యు, నాయుడు, అహరోన్, దివ్య తేజ, రమ్య, స్మైలీ, ప్రేమరత్నం తదితరులు పాల్గొన్నారు.

## 25 నుండి చోడవరం సుగర్స్‌లో క్రషింగ్

**ప్రజాశక్తి-చోడవరం**

చోడవరం (గోవాడ) చక్కెర కర్మాగారం క్రషింగ్ ఈనెల 25వ తేదీ నుండి ప్రారంభమవుతుందని సుగర్ ఫ్యాక్టరీ ఎమ్‌డి వి.సన్యాసినాయుడు తెలిపారు. ఆదివారం సుగర్ ఫాక్టరీ బాయిలర్‌లో ఎమ్‌డి అగ్ని వేసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఈ ఏడాది రెండు లక్షల టన్నులు చెరుకు క్రషింగ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నేరుగా వారి వద్దకే పర్మిట్లు అందజేస్తామని, ఏ ఒక్కరు వాటికోసం సుగర్ ఫ్యాక్టరీ వద్దకు రావలసిన అవసరం లేదని తెలిపారు. ఓవర్ ఆయిలింగ్ పనులన్నీ పూర్తికావస్తున్నాయని క్రషింగ్ లక్ష్యాన్ని చేరుకోవడానికి కార్మికులు రైతులు తమ సహాయ సహకారాలు అందివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులతో పాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.



బాయిలర్‌లో నిప్పు పెడుతున్న దృశ్యం



డ్రోన్ ద్వారా ఫొటో తీసిన తాళ్ల పాలెం జంక్షన్

## రోడ్డు ప్రమాద ప్రాంతాల్లో డ్రోన్‌తో పరిశీలన

**ప్రజాశక్తి-కశింకోట :** అనకాపల్లి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కసింకోట సిఐ అల్లు స్వామినాయుడు మండల పరిధిలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను ఆదివారం డ్రోన్ కెమెరాతో పరిశీలించి ఫోటోలు తీశారు. ప్రధానంగా కసింకోట జంక్షన్, ఫిష్ పెట్రోల్ బంక్ జంక్షన్, బయ్యవరం జంక్షన్, హెరిటేజ్ జంక్షన్, జమాదుల పాలెం జంక్షన్, పరవాడపాలెం జంక్షన్, ఉగ్గిన పాలెం, తాళ్లపాలెం జంక్షన్, గొబ్బూరు జంక్షన్, నరసింగబిల్లి జంక్షన్, నూతన గుంట పాలెం జంక్షన్‌లను డ్రోన్ కెమెరాతో ఫోటోలు తీశారు. ఇక్కడ రోడ్డు ప్రమాదాలకు కారణాలు తెలుసుకుని ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం జరుగుతుందని సిఐ స్వామినాయుడు తెలిపారు. ప్రభుత్వం, పోలీసు రోడ్డు ప్రమాదాలపై ఎన్నో అవగాహన కార్యక్రమాలు చేస్తున్నా ఎవరూ పాటించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హైవే ఆనుకొని ఉన్న గ్రామస్తులు జంక్షన్ పాయింట్ల వద్ద రోడ్డు క్రాస్ చేసినప్పుడు వాహనాలు గమనించి రోడ్ క్రాస్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## దావత్ ఫ్యామిలీ రెస్టారెంట్, దాబా ప్రారంభం

**ప్రజాశక్తి-సబ్బవరం :** మండలంలోని సబ్బవరం- చోడవరం రోడ్డులోని లా యూనివర్సిటీ సమీపంలో వైసిపి మండల అధ్యక్షులు కర్రి బాబు నూతనంగా ఏర్పాటు చేసిన దావత్ ఫ్యామిలీ రెస్టారెంట్, అండ్ దాబా ఆదివారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ ఉపముఖ్యమంత్రి, వైసిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బూడి ముత్యాలనాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకట్రావు, పెందుర్తి నియోజకవర్గ నాయకులు గండి రవికుమార్, సర్పంచ్ దెడ్డం ప్రసాద్, కాపుశెట్టి శేషుబాబు, యువజన విభాగం అధ్యక్షులు యడ్ల నాయుడు, రాపర్తి మాధవ్, బొడ్డేటి మహాలక్ష్మినాయుడు, మళ్ల బాలాజీ, ఉపసర్పంచ్‌లు సిరపరపు వాసు, దుర్గా ప్రసాద్, మచ్చ కోటి, సంద్రన అప్పారావు, గండి రవికుమార్ యువ సైన్యం ప్రతినిధులు పాల్గొన్నారు.



రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న వైసిపి జిల్లా అధ్యక్షులు బూడి ముత్యాల నాయుడు

# ఘనంగా పొట్టి శ్రీరాములు వర్ధంతి


అనకాపల్లిలో నివాళి అర్పిస్తున్న డిఎస్‌పి

ప్రజాశక్తి- యంత్రాంగం

**అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆదివారం విశాఖ, అనకాపల్లి జిల్లాలోని పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.**

**నక్కపల్లి:**మండలంలోని చినదొడ్డుగల్లు గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి జనార్ధన్ ఆధ్వర్యంలో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్‌ల వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, విశ్రాంత ఉపాధ్యాయులు శ్రీపాద సత్యదేవ శర్మ, ఉపాధ్యాయులు ఎన్ వి ఎస్ ఆచార్యులు, సతీష్‌లు పొట్టి శ్రీరాములు, పటేల్ చిత్రపటాలకు పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆంధ్రుల ఆశయ సాధన కోసం తన జీవితాన్నే తృణప్రాయంగా త్యాగం చేసిన త్యాగధనుడు పొట్టి శ్రీరాములన్నారు. భారతదేశ ఉక్కు మనిషిగా సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ పేరు గాయించారన్నారు. వారి జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు.

**చీడికాడ:** మండల కేంద్రంలో శాఖ గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఎంఎస్ఎల్ జోగేశ్వరి ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ, మద్రాసు నుండి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కావాలని అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం మరిచి పోలేనిదన్నారు.

**అనకాపల్లి:**అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. జిల్లా రెవిన్యూ అధికారి వైఎస్‌వికెజిఎస్-ఎల్.సత్యనారాయణరావు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితంగా ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వార్డు సచివాలయ అధికారి మంజులావాణి, డీఈవో కార్యాలయ అధికారి వెంకటేశ్వరరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో డిఎస్‌పి ఎం శ్రావణి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులు అర్పించారు. సీఐ విజయ్ కుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బల్ల నాగభూషణం ఆధ్వర్యంలో స్థానిక మెయిన్ రోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ ప్రతినిధులు బొడ్డు సోమరాజు, సిద్దార్థ అసోసియేషన్ ప్రతినిధులు వినకోట నీలేష్ గుప్తా, పట్నాల కృష్ణమోహన్, రొబ్బి మల్లేశ్వరరావు, నందేల అప్పారావు, యర్ర బాబ్జీ పాల్గొన్నారు.

**వేషాలంకరణ విద్యార్థులకు బహుమతుల ప్రదానం**

పొట్టి శ్రీరాములు 72 వర్ధంతి సందర్భంగా పొట్టిశ్రీరాములు భవన్‌లో పొట్టి శ్రీరాములు వేషధారణ చేసి ఏక పాత్రభినయం చేసిన విద్యార్థులను, తెలుగు తల్లి, ఆంధ్రా మాత వేశాలు ధరించిన బాలికలకు బహుమతులు అందజేశారు. అలాగే నూతనంగా స్థానిక దేవాలయాల చైర్మన్‌లుగా ఎంపికైన బొడ్డేడ మురళి, అమరపల్లి కృష్ణాజి, అప్పికొండ గణేష్, డైరెక్టర్స్‌ను, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కాండ్రేగుల దుర్గా ప్రసాదరావును పిరాట్ల మూర్తి సత్కరించారు. విటి కృష్ణ, గంగుపాం నాగేశ్వరావు పాల్గొన్నారు.


నక్కపల్లిలో ..

**సబ్బవరం :** స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.రామకృష్ణ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పాఠశాలలో విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, వక్తత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ సిహెచ్‌వివి సత్యారావు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

**విశాఖ కలెక్టరేట్ :** జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్.భవానీశంకర్ పూలమాలవేసి నివాళులర్పించారు. కలెక్టరేట్ ఇన్‌ఛార్జి పరిపాలన అధికారి వి.సుజాత, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

**ఎంవిపి కాలనీ :** జివిఎంసి ప్రధాన కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి అదనపు కమిషనర్ డివి.రమణమూర్తి, సిబ్బంది పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఎంవిడి ఫణిరామ్, అధికారులు ఎ.అప్పలనాయుడు, ఆనంద్,రియాజ్, ఎ.అప్పలరాజు పాల్గొన్నారు.

**మధురవాడ** :ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక, స్ఫూర్తి ప్రదాత పొట్టి శ్రీరాములు అని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ అన్నారు. ఆదివారం చంద్రపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగినఆత్మార్పణ దినం కార్యక్రమంలో భాగంగా అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం ప్రాణాలు పోయేవరకు పోరాటం చేసిన స్వాతంత్ర సమరయోధుడని కీర్తించారు. అమరజీవి వర్ధంతిని ఆత్మార్పణ దినంగా పాటించడం ప్రభుత్వం ఆయనకిచ్చిన గొప్ప గౌరవమన్నారు. ప్రధానోపాధ్యాయుడు గొట్టేటి రవి మాట్లాడుతూ మహాత్మాగాంధీతో పాటు నడచి స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్న పొట్టి శ్రీరాములు, దళితుల దేవాలయ ప్రవేశంపై ఉద్యమం చేసి సాధించిన సంస్కర్త అని కొనియాడారు. విద్యార్థుల దేశభక్తి గీతాలు అలరించాయి. కార్యక్రమంలో రత్నకుమార్, భాస్కర్ ప్రకాష్, రమాదేవి పాల్గొన్నారు.


బోధన చేస్తున్న ఉపాధ్యాయులు

## టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

**ప్రజాశక్తి- నక్కపల్లి:**విద్యాశాఖ కమిషనర్, జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఇఓలు నరేష్, వేమగిరి నూకరాజు తెలిపారు. పదిలో శత శాతం ఉత్తీర్ణత సాధించడానికిగాను నూరు రోజుల ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా పదవ తరగతి విద్యార్థులకు అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించడం జరుగుతుందని, సెలవు దినాల్లో కూడా ఉదయం, మధ్యాహ్నం తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలోని పలు పాఠశాలలో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయులు తరగతులు నిర్వహించారు. విద్యార్థులను సబ్జెక్టుల వారీగా చదివించి, వారి సందేహాలను నివృత్తి చేశారు.



కొబ్బరి మొక్కను నాటుతున్న సర్పంచ్

## కొబ్బరి మొక్కలు నాటివేత

**ప్రజాశక్తి- రావికమతం:**మండలంలో తట్టబంద సర్పంచ్ గోకివాడ రమణ ఆధ్వర్యంలో కొబ్బరి మొక్కలు ఆదివారం నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమణ మాట్లాడుతూ, తట్టబంద పంచాయతీ శివారు కసిరెడ్డి పాలెం గ్రామంలో దేవేంద్ర చెరువు గట్టుపైన 160 కొబ్బరి మొక్కలను నాటడం జరిగిందన్నారు. ఇది గ్రామ పంచాయతీకి ఒక ఆదాయ వనరుగా ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. గ్రామపంచాయతీ పరిధిలో చెరువు గట్లు, ఖాళీగా ఉన్న గెడ్డ పోరంబోకు స్థలాలు, గ్రామకంఠం స్థలాలలో మొక్కలను వేయడంతో గ్రామపంచాయతీకి ఆదాయం సమకూరు తుందన్నారు. పంచాయతీ వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు, ప్రజలు అందరూ సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు, వీఆర్పీ నూకరాజు గ్రామస్తులు పలువురు పాల్గొన్నారు.

## ఆలయానికి వెండి శఠగోపం వితరణ

**ప్రజాశక్తి-మాడుగుల:**మండలంలోని ఎం.కోడూరు గ్రామ దేవత మోద కొండమ్మ ఆలయానికి విశాఖకు చెందిన విశ్రాంత ఎస్సై. పోతిన వెంకటరమణ త్రివేణి దంపతుల కుమార్తెలు జానకి వెంకట ప్రసన్న. లౌక్య ఆర్థిక సహాయంతో అమ్మవారికి 30 తులాల వెండి శతగోపాన్ని ఆలయ కమిటీ చైర్మన్, సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ముమ్మిన రమణబాబు, పడాల అప్పలనాయుడు, పోతిన జగదీష్, పడాల అప్పల నరసయ్య, కలిమి గోసమ్మ. చింత వెంకటనారాయణ మూర్తి. జాజిమొగ్గల చిరంజీవి, అర్చకులు శ్రీనివాస శర్మ పాల్గొన్నారు.


అందజేస్తున్న దాతలు

## పర్యాటకుల సందడి

**ప్రజాశక్తి-డుంబ్రిగుడ:**మండలంలో పర్యాటక ప్రదేశాలైన చాపరాయి జలపాతం, అరకు పైనారిలో ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు పోటెత్తడంతో కిటకిట లాడింది. చాపరాయి జలపాతంలో అధిక సంఖ్యలో పర్యాటకులు రావడంతో వాహనాల రద్దీ ఏర్పడింది. పర్యాటకులు జలపాతంలో జారుతూ స్నానాలు చేస్తూ ఆనందంగా గడిపారు. దింసా నృత్య బృందంతో కలిసి నృత్యాన్ని ప్రదర్శిస్తూ పర్యాటకులు అను భూతిని పొందారు. కుటుంబ సమేతంగా వనభోజనాలు చేస్తూ ఆనందంగా గడిపారు. తెల్లవార్లు కురిసిన పొగ మంచు అందల్లో ద్విచక్ర వాహనాల్లో సరదాగా ప్రయాణిస్తూ సందడి చేశారు.


తరలివచ్చిన పర్యాటకులు

# కల్యాణ మండపం ప్రారంభం

**ప్రజాశక్తి-గొలుగొండ:**మండలంలోని ఏఎల్.పురంలో చెక్కవారి వెంకట పద్మావతి కళ్యాణ మండపంను ఆదివారం రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రారంభించారు. చెక్క సంతోష్ ఆహ్వానం మేరకు ఈ నూతన కళ్యాణ మండపాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు, నాయకులు బొడ్డు సజమీలు, పెట్ల నారాయణమూర్తి, మాజీ సర్పంచ్ కుందూరు అప్పారావు, మాజీ వైస్ సర్పంచ్ గొంప వాసు, పాపారావు, రాజులనాయుడు తదితరులు పాల్గొన్నారు.


ప్రారంభిస్తున్న స్పీకర్ అయ్యన్న

# సిపిఎం మహాసభలను జయప్రదంచేయాలి

**ప్రజాశక్తి-రోలుగుంట్** నర్సీపట్నంలో ఈ నెల 20, 21, 22 తేదీల్లో జరిగే సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు ఈరెల్లి చిరంజీవి కోరారు. ఆదివారం మండలంలోని అర్ల పంచాయతీలో మహాసభల పోస్టర్ విడుదల చేసి మాట్లాడారు. జిల్లా ఏర్పడిన మొదటిసారిగా నర్సీపట్నంలో ఈ మహాసభలు జరుగుతు న్నాయన్నారు. ఈ సభల్లో వివిధ అంశాలపై చర్చించడం జరగుతుందని చెప్పారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

## గిరిజనులకు రగ్గుల పంపిణీ

**ప్రజాశక్తి-డుంబ్రిగుడ:**మండలంలోని గుంటసీమ పంచాయతీ సరియవలస గ్రామంలోని సుమారు 50 మంది గిరిజనులకు ఆదివాసి గిరిజన సంఘం, శారద ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఉచితంగా రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌బి పోతురాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు టి సూర్యనారాయణ, మండల అధ్యక్షుడు పి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ పి సురేష్ కుమార్, నాయకులు తిలక్, టి.రామదాస్, కే.కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

**ప్రజాశక్తి-గొలుగొండ:**గొలుగొండ శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం విద్యార్థులకు బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్ నిర్వహించారు. విద్యార్థులచే పొట్టి శ్రీరాములు జీవిత చరిత్రను చదివించారు.

## ఘనంగా ముస్లిముల పండుగ

**ప్రజాశక్తి -నక్కపల్లి:**మండలంలోని పెదబోదుగల్లం లో ముస్లిం సోదరులు ఆదివారం ఘనంగా ఖాదర్ వల్లి ఉర్సు పండగ జరుపుకున్నారు. ముస్లిం సోదరులు బావుటాలను గుర్రంపై గ్రామంలో ఊరేగించారు. దర్గాలో, మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.


ఊరేగిస్తున్న ముస్లిం సోదరులు



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

## నవోదయ పబ్లిక్ స్కూల్‌లో మోడల్ పరీక్షలు

**ప్రజాశక్తి -రావికమతం:**మండల కేంద్రంలోని నవోదయ పబ్లిక్ స్కూల్‌లో కరస్పాండెంట్ చంద్రశేఖర్ పట్నాయక్ ఆధ్వర్యంలో నవోదయ, సైనిక్ స్కూల్ మోడల్ పరీక్షలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నవోదయ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ మాట్లాడుతూ, ఈ పరీక్షలకు 165 మంది విద్యార్థిని ,విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. ఈ పరీక్షలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మొదటి బహుమతిగా రూ.25,000, రెండవ బహుమతి రూ.12,500, మూడవ బహుమతి రూ.6,250, నాలుగవ బహుమతి రూ.3,000 5వ బహుమతి రూ.1500, ఆరు నుండి 10 ర్యాంకులలో నిలిచిన వారికి ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు చొప్పున నగదు బహుమతులను అకాడమీ ప్రతినిధులు అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.




ఉచిత నేత్ర వైద్య శిబిరం ప్రారంభంలో అతిథులు

## హెచ్‌ఎస్‌ఎల్ ఉచిత కంటి శిబిరం

**ప్రజాశక్తి-విశాఖపట్నం :** శంకర్ నేత్రాలయ సహకారంతో హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (హెచ్‌ఎస్‌ఎల్) ఫౌండేషన్ ఆధ్వర్యాన విజయనగరం జిల్లా మెంటాడ మండలం పెదమేడపల్లిలో 4 రోజుల ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని ఆదివారం రిటైర్డ్ హెచ్‌ఎస్‌ఎల్ డైరెక్టర్ సిఎమ్‌డిఎ రాకేష్ ప్రసాద్ ప్రారంభించారు. ఆదివారం 150 మందికి పైగా గ్రామస్తులు ఉచిత కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా రాకేష్ ప్రసాద్ మాట్లాడుతూ, ఈ శిబిరం ఈ నెల 18వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు. వైద్యుల సూచనల మేరకు 100 మందికి కళ్లద్దాలు, 100 మందికి శస్త్ర చికిత్సలు చేయనున్నట్లు చెప్పారు. శంకర్ ఫౌండేషన్ సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పి.అప్పలనాయుడు, శంకర్ ఫౌండేషన్ జనరల్ మేనేజర్ రాధాకృష్ణన్, హెచ్‌ఎస్‌ఎల్ జనరల్ మేనేజర్ డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## మనసు దోచిన సుమధుర గీతాలు

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆదివారం రాత్రి అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సినీ సంగీత విభావారి ఆధ్యంతం అలరించింది. ముఖ్య అతిథిగా నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి, పైడా విద్యాసంస్థలు అధినేత కృష్ణప్రసాద్, మాజీ పోలీసు అధికారి మహ్మద్ ఖాన్, కొణతాల రాజు తదితరులు హాజరయ్యారు. గాయకులు భాగ్యలక్ష్మి, మాధవి, సూర్య ప్రకాష్, వాసంతి, సాను, రామనీ, వీరేంద్ర యాదవ్, బంగారాజు, ప్రకాష్ రాంనరసింహం ప్రజాదరణ పొందిన ఘంటశాల గీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా అతిథులను విశాఖ సకల కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి చెన్నా తిరుమలరావు, వివిధ కళా సంస్థల అధినేతలు సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

## సోలార్ విద్యుత్ పరికరాలు అందజేత

**ప్రజాశక్తి -అనంతగిరి:**మండలంలోని నాన్ షెడ్యూల్ రొంపల్లి పంచాయతీ చిన్న కోనల, బూరిగ, మంగళ గుడ్డే గ్రామాల గిరిజనులకు మాజీ ట్రైబల్ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఇఎఎస్ శర్మ తన సొంత డబ్బులతో సోలార్ వీధి పరికరాలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడారు.




జెండా ఊపి ప్రారంభిస్తున్న తూర్పు నావికా దళ విభాగాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్



మారథాన్‌లో పాల్గొన్న విశాఖ వాసులు

# విజయవంతంగా వైజాగ్ మారథాన్

**ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ :** ఇండియన్ నేవీ ఆధ్వర్యాన 12 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న వైజాగ్ నేవీ మారథాన్ 9వ ఎడిషన్ ఆదివారం ఉదయం విశాఖపట్నం బీచ్ రోడ్‌లో విజయవంతంగా జరిపారు. వివిధ కేటగిరీలలో సుమారు 12 వేల మంది రన్నర్లు పాల్గొన్నారు. ఈ మారథాన్ మొత్తం నాలుగు విభాగాల్లో నిర్వహించగా 42.2 కిలోమీటర్ల ఫుల్ మారథాన్, 21.1 కిలోమీటర్ల హాఫ్ మరధాన్‌లను బీచ్ రోడ్‌లోని విశ్వ ప్రియ ఫంక్షన్ హాల్ వద్ద తూర్పు నావికా దళ విభాగాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ జెండా ఊపి ప్రారంభించారు. 10 కిలోమీటర్ల రన్‌ను విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, 5 కిలోమీటర్ల రన్‌ను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత భాగ్చి ప్రారంభించారు.

ఈ సందర్భంగా తుర్పునవికా దళ విభాగాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పంధార్కర్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమం లో పాల్గొని విజయవంతం చేసిన విశాఖ ప్రజలకు, సహకరించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్,మాట్లాడుతూ ఈ కార్యక్రమం వల్ల విశాఖపట్నం టూరిజం ఫెసిలిటీస్, సముద్రతీరం, గురించి తెలియజెప్పే అవకాశం ఏర్పడుతుందన్నారు.

### రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని

# ఆదివాసీల ఆందోళన



నిరసన చేపడుతున్న ఆదివాసీలు

**ప్రజాశక్తి -కొత్తకోట:**రీ సర్వే లో జరిగిన అక్రమాలపై రెవెన్యూ సదస్సులో ఇచ్చిన ఫిర్యాదులను పరిష్క రించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం గదబపాలెం, రామన్నదొరపాలెం గ్రామాలకు చెందిన పివిటిజి గదభ ఆదివాసి గిరిజనులు నిరసన చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.గోవిందరావు, గిరిజన రైతులు అరిగేల అచ్చన్న, ధోని అర్జున, గోరా పెద్ది రాజు తదితరులు మాట్లాడుతూ, రావికమతం మండలం కొట్నాబెల్లి రెవిన్యూ పరిధిలో రామదొరపాలెం గ్రామంలో ఎల్‌సిసి భూములను 12 కుటుంబాలకు సుమారు 16 ఎకరాలు 1975లో పట్టాలు అప్పటి ప్రభుత్వం ఇచ్చిందన్నారు. గదబపాలెం గ్రామంలో 20 కుటుంబాలకి 148/16,71,72,120 సర్వే నెంబర్లో 1988-89 ఏడాదిలో ప్రభుత్వం డి పట్టా భూములు ఇచ్చిందని చెప్పారు. అప్పటి నుంచి తమ సాగులో ఉందని పేర్కొన్నారు. శ్రమించి జీడి మామిడి తోటలు పెంచి అ భూముల పై ఆధారపడి జీవిస్తున్నామన్నారు తమ పేర్లు 22ఏ జాబితాలో కూడా ఉన్నాయని గత ఏడాదిలో జరిగిన జగనన్న రిసర్వేలో డి ఎల్ ఆర్ రికార్డులలో తమ భూముల్ని ప్రభుత్వం భూములుగా నమోదు చేశారని తెలిపారు. ఈ ఏడాదిలోనే ఎస్టీ కమిషన్ చైర్మన్‌కి ఫిర్యాదు చేయగా ఈ సమస్యను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కు ఆదేశాలు జారీ చేసారని వివరించారు.ఈ సమస్య ను పరిష్కారం చేయాలని ఆదేశించారని దీనిపై . మండల రెవిన్యూ అధికారులు రామదొరపాలెం, గదప పాలెం గ్రామాలలో క్షేత్రస్థాయిలో పరిశీలించి. చర్యలు చేపట్టాల్సి ఉన్నప్పటికి అ దిశగా చర్యలు లేవని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే తమ భూములు తమ పేరున రెవెన్యూ రికార్డులలో నమోదు చేయాలని డిమాండ్ చేశారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రాజు

## ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

**ప్రజాశక్తి-రోలుగుంట:**రోలుగుంట మడలం కుంచుగుమ్మల గ్రామంలో సత్యనారాయణమూర్తి దేవాలయం నిర్మాణానికి ఆదివారం చోడవరం ఎమ్మెల్యే రాజు శంకుస్థాపన చేశారు. అనంతరం కంచుగుమ్మల సెంటర్ నుండి అల్లువాని కల్లాలకు వేసిన రోడ్డును పరిశీలించారు. అనంతరం రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి

### నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ

**ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ :** విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని విశాఖపట్నం నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ అన్నారు. ఎంవిపి కాలనీ ఉషోదయ జంక్షన్ వద్ద గత 25 ఏళ్లుగా సేవలందిస్తున్న కిడ్స్ గార్డెన్ పబ్లిక్ స్కూల్ సిల్వర్ జూబ్లీ వేడుకలు ఆదివారం డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర పోలీసు కమిషనర్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులకు తల్లిదండ్రులు లక్ష్యాలు నిర్దేశించాలని కోరారు. విద్యార్థులకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మార్గదర్శకులుగా ఉండాలన్నారు. విద్యార్థులు కష్టపడే తత్వం అలవాటు చేసుకోవాలని చెప్పారు. సైబర్ క్రైమ్ నేరాలు పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

గౌరవ అతిథి, కథా రచయిత, నటి, దర్శకులు సువశ్రీ ముఖర్జీ మాట్లాడుతూ, జీవితంలో బాల్యం మరపురానిదని అభివర్ణించారు. పాఠశాల మొదటి మెట్టు ఎక్కించే సంస్థ అన్నారు.

స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సాయిలక్ష్మి మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా ఎంతో మంది విద్యార్థులు తమ పాఠశాలలో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించారని తెలిపారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నూతన పద్ధతులలో విద్యను అందించేందుకు స్కూల్ పేరును ఆర్క్యగా మారుస్తున్నామని తెలిపారు. పాఠశాలలో ఏటా వేసవిలో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏకలవ్య, గాంధార విద్యలో కూడా తర్ఫీదు ఇస్తున్నామని చెప్పారు. అనంతరం స్కూల్ చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రాజశేఖర్, విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.




కిడ్స్ గార్డెన్ సిల్వర్ జూబ్లి వేడుకల్లో పాల్గొన్న నగర పోలీసు కమిషనర్